షణ్ముఖ SHANMUKHAVELUGU APTEL 16448

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక

సంపుటి : 1 సంచిక : 214 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ ఆదివారం 16 జూన్ 2024 పేజీలు 8 : వెల 3/- ఒంగోలు

VOLUME : 01 ISSUE : 214 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE June 16, 2024 PAGES : 8 PRICE : 3/-


## వందేభారత్‌లో ఇక బెర్తులు

### త్వరలోనే అందుబాటులోకి తెస్తాం
### కేంద్రమంత్రి వైష్ణవీ అశ్విన్ వెల్లడి



న్యూఢిల్లీ,జూన్15(షణ్ముఖవెలుగు): ప్రధాన నగరాలు, పట్టణాల మధ్య ప్రయాణ సమయాన్ని తగ్గించేందుకు కేందప్రభుత్వం వందే భారత్ రైళ్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇప్పటికే వందేభారత్ ఏసీ చైర్‌కార్ రైళ్లు అందుబాటులోకి రాగా.. తాజాగా వందే భారత్ స్లీపర్ కోచ్ రైళ్లను రైల్వే శాఖ అందుబాటులోకి తీసుకురానుంది. గత కొంతకాలంగా ఈ ప్రక్రియ కొనసాగుతోంది. తాజాగా రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ వందే భారత్ స్లీపర్

మిగతా 2లో..

## అక్రమ రవాణాపై ఉక్కు పాదం

### అటవీ దొంగలు ఎంతటి వారైనా ఉపేక్షించం
### అడవులను, పర్యావరణాన్ని కాపాడుతాం



**ఎర్రచందనం దొంగలను అరికడతాం**

**ఎంతటి వారైనా కటకటాల్లోకి తోసేస్తాం**

**ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కృషి**

**మీడియాతో డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్**

అమరావతి,జూన్15(షణ్ముఖవెలుగు): ఎర్రచందనం, అటవీ సంపద అక్రమ రవాణాపై ఉక్కు పాదం మోపుతామని ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్–గ్రామీణాభివృద్ధి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ హెచ్చరించారు. అడవుల వినాశనానికి పాల్పడినా, ప్రయత్నించినా ఎంతటి వారైనా సరే కటకటాల వెనక్కు వెళ్లాల్సిందేనని మాస్ వార్నింగ్ ఇచ్చారు. రాష్ట్ర ప్రజలకు మేలైన సేవలు అందించే భాగ్యం కలిగిందని

మిగతా 2లో..

## మంత్రి పవన్‌కు వదినమ్మ గిఫ్ట్

### ఖరీదైన మోంట్‌బ్లాక్ పెన్ను బహుమానం

హైదరాబాద్,జూన్15(షణ్ముఖవెలుగు): మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం అన్నయ్య చిరంజీవి కుటుంబాన్ని కలిసేందుకు పవన్ హైదరాబాద్ వచ్చారు. ఈ సందర్భంగా ఆయన వదినమ్మ సురేఖ అత్యంత ఖరీదైన

మిగతా 2లో..

ప్రజలకు తనకు మధ్య అడ్డుగోడలు ఉండరాదు

ప్రజల నుంచి వినతుల స్వీకరణకు ప్రత్యేక ఏర్పాటు

పోలవరం నుంచే ప్రజాక్షేత్రంలోకి వెళతా

విధ్వంసానికి సాక్షిగా ప్రజావేదిక శిథిలాలు

పార్టీ కార్యాలయంలో మీడియాతో సిఎం చంద్రబాబు

పార్టీ కోసం కష్టపడ్డవారికి నామినేటెడ్ పదవులు

త్వరలోనే భర్తీ చేస్తామన్న సిఎం చంద్రబాబు

పార్టీ శ్రేణులతో టెలి కాన్ఫరెన్స్‌లో స్పష్టీకరణ

అమరావతి,జూన్15(షణ్ముఖవెలుగు): తనకు, ప్రజలకు మధ్య ఎలాంటి అడ్డుగోడలు ఉండటానికి వీల్లేదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి వారి సమస్యల వినతుల స్వీకరణకు ప్రత్యేక ఆలోచన చేస్తున్నామని తెలిపారు. ఈ విషయాన్ని ఏ పద్ధతుల్లో ఏర్పాటు చేయాలో అభిప్రాయాలు తీసుకుని ఉత్తమ విధానం అమలు చేస్తామని అన్నారు. శనివారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయానికి చంద్రబాబు వచ్చారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో చిట్ చాట్ చేశారు. ఏపీ సచివాలయంలోనే వినతులు స్వీకరిస్తే ఎలా ఉంటుందనే విషయంపై ఆలోచిస్తున్నా మని తెలిపారు. ప్రజావినతులు స్వీకరణకు వీలైనంత ఎక్కువ సమయం కేటాయిస్తానని హామీ ఇచ్చారు. వాటి పరిష్కారానికి నిర్దిష్ట సమయం ఉండేలా చర్యలు తీసుకుంటానని మాటిచ్చారు. సచివాలయానికి రాకపోకల కోసం రవాణా, ఇతరత్రా వెసులుబాటులన్నీ అందుబాటులోకి తెస్తానని హామీ ఇచ్చారు. ప్రజావేదిక ఉండి ఉంటే వినతుల స్వీకరణకు అనువుగా ఉండేది, కానీ జగన్ ప్రజా వేదికను కూల్చి వేశారని గుర్తుచేశారు. ప్రజావేదికను విధ్వంస పాలనకు ప్రతీకగా అలానే ఉంటుందని ఉద్ఘాటించారు. ఆ శిథిలాలను తొలగించమని అన్నారు. త్వరలోనే క్షేత్ర స్థాయి పర్యటనలు ప్రారంభిస్తామని వివరించారు. పోలవరంతోనే తన క్షేత్రస్థాయి పర్యటనలు ప్రారంభమవుతాయని చెప్పారు.

మిగతా 2లో..

## ప్రభుత్వ కార్యాలయాల్లో సిఎం, డిప్యూటీ ఫోటోలు

### చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఫోటోలు ఉండాల్సిందే
### అధికారులను ఆదేశించిన సిఎం చంద్రబాబు

అమరావతి,జూన్15(షణ్ముఖవెలుగు): ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యమంత్రి ఫోటోలను ఏర్పాటు చేస్తుంటారు. కానీ రాష్ట్రంలో ఇకపై సీఎం చంద్రబాబు నాయుడుతోపాటు ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన పవన్ కల్యామ్ చిత్రపటాలను కూడా ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో, ప్రభుత్వ కార్యక్రమాల్లో ఇరువురు ఫొటోలను ఏర్పాటు చేయాల్సిందిగా

మిగతా 2లో..

# కార్యకర్తల అలుపెరగని శ్రమ

### ఆపార కృషి వల్లే కూటమి ఘన విజయం
### ఈ విజయం కార్యకర్తలకు అంకితం చేస్తున్నా
### ప్రజలు నమ్మకంతో చారిత్రాత్మక తీర్పు ఇచ్చారు



## 18న వారణాసిలో మోడీ పర్యటన

**కిసాన్ సమ్మాన్ నిధులు**

**అదేరోజు విడుదల**

**కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి**

**శివరాజ్ సింగ్ చౌహాన్ వెల్లడి**



న్యూఢిల్లీ,జూన్15(షణ్ముఖవెలుగు): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈనెల 18న వారణాసిలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ప్రధాన్ మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి స్కీమ్ 17వ ఇన్‌స్టాల్‌మెంట్ కింద రూ.20,000 కోట్లు విడుదల చేయదలనున్నారు. అనంతరం 30,000 సెల్ఫ్ హెల్ప్ గ్రూప్‌లకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారు. శనివారంనాడిక్కడ ఏర్పాటు చేసిన

మిగతా 2లో..

## ప్రజలకు కర్నాటక కాంగ్రెస్ షాక్

**పెట్రోల్, డీజిల్‌పై సేల్స్ ట్యాక్స్**

**పెంచిన ప్రభుత్వం**

**లీటర్ పెట్రోల్‌పై 3కు పైగా**

**పెరుగుదల..వెంటనే అమల్లోకి**

**ఆదేశాలు**

బెంగళూరు,జూన్15(షణ్ముఖవెలుగు): వాహనదారులకు కర్నాటకలో కాంగ్రెస్ సర్కారు షాకిచ్చింది. లోక్‌సభ ఎన్నికలు ముగియగానే పెట్రోల్, డీజిల్ ధరలను పెంచింది. ఈ మేరకు పెట్రోల్, డీజిల్‌పై సేల్స్ ట్యాక్స్ పెంచినట్టు కర్ణాటకలోని కాంగ్రెస్ సర్కారు శనివారం మధ్యాహ్నాం నోటిఫికేషన్ విడుదల చేసింది. కర్ణాటకలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య

మిగతా 2లో..

## స్పందనకు సరికొత్త రూపం



ప్రజా ఫిర్యాదలు పరిష్కార వేదికగా మార్పు

ఫిర్యాదుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత

మంగళగిరి ప్రజలకోసం లోకేశ్ ప్రత్యేక ఏర్పాట్లు

అమరావతి,జూన్15(షణ్ముఖవెలుగు): ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా ఏర్పాటైన తెదేపా ప్రభుత్వం వ్యవస్థల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా గతంలో స్పందన పేరిట చేపట్టిన వ్యవస్థలో పూర్తిస్థాయి మార్పులు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. 'స్పందన' పేరును తొలగించి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థగా కొనసాగించాలని ఉత్తర్వులను జారీ చేసింది. ఇక నుంచి పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రస్సల్ సిస్టమ్ పేరుతో ఫిర్యాదుల స్వీకరణ చేపట్టాలని కలెక్టర్లకు ఆదేశాలిచ్చింది. ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేసింది. ప్రజలకు మరింత అందుబాటులో ఉండేలా తీర్చిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించింది. కలెక్టరేట్లలో

మిగతా 2లో..

## ప్రోత్సాహకాలతోనే పరిశ్రమలకు ఊతం

**ఎపిలో కొత్త పరిశ్రమలకు చేయూతనిస్తాం**

**పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్**



కర్నూలు,జూన్15(షణ్ముఖవెలుగు): కంపెనీల సమస్యలు తీరిస్తే ఏపీకి భారీ పరిశ్రమలు వచ్చే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. 2014నుంచి 2019వరకు, 2019నుంచి

మిగతా 2లో..

## ఎపికి బ్రాండ్‌గా అమరావతి నిర్మాణం

**రెండున్నరేళ్లలో నిర్మించి తీరుతాం**

**మంత్రి పొంగూరు నారాయణ వెల్లడి**

అమరావతి,జూన్15(షణ్ముఖవెలుగు): అమరావతిని అత్యుత్తమ రాజధానిగా తీర్చిదిద్దుతామని పురపాలకశాఖ మంత్రి నారాయణ అన్నారు. రెండున్నరేళ్లలో పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. అమరావతిని ఎపికి బ్రాండ్‌గా నిలబెడతామని అన్నారు. రాజధాని అభివృద్ధిపై శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'రాజధాని అభివృద్ధికి పక్కా ప్రణాళిక సిద్ధంగా ఉంది. రెండున్నరేళ్లలో నిర్మాణం పూర్తవుతుంది. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. అమరావతి రాజధాని

మిగతా 2లో..

## జగన్ లోటస్‌పాండ్ ఇంటిముందు ఆక్రమణలు

### రోడ్డును ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలు కూల్చివేత

హైదరాబాద్,జూన్15(షణ్ముఖవెలుగు): వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి రేవంత్ సర్కార్ ఊహించని ఝలక్ ఇచ్చింది. హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్‌లో జగన్ ఇంటి ముందు ఉన్న అక్రమ నిర్మాణాలపై జీహెచ్ఎంసీ కొరడా ఝులిపించింది. జగన్ ఇంటిముందు ఉన్న అక్రమ నిర్మాణాలను ఒక్కొక్కటిగా అధికారులు కూల్చివే స్తున్నారు. గతంలో జగన్ భద్రత కోసం రోడ్డును ఆక్రమించి మరీ గదులను సిబ్బంది నిర్మించడం జరిగింది. రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు

మిగతా 2లో..


శ్రీ చాముండీశ్వరి అమ్మవారి దేవస్థానము

గంగపట్నం గ్రామం, ఇందుకూరుపేట మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.



వార్షిక బ్రహ్మోత్సవాలు

తేది 13-6-2024 గురువారం నుండి

తేది 24-6-2024 సోమవారం వరకు

శ్రీ చాముండీశ్వరి అమ్మవారి బ్రహ్మోత్సవములు అత్యంత వైభవముగా జరుగును. కావున యావన్మంది భక్త మహాశయులందరూ ఈ అమ్మవారి బ్రహ్మోత్సవములలో పాల్గొని తీర్థప్రసాదములు స్వీకరించి అమ్మవారి కృపాకటాక్షములకు పాత్రులు కావలసినదిగా కోరుచున్నాము.

| | | |
|---|---|---|
| 13-6-2024 | గురువారము | అంకురార్పణ, ధ్వజారోహణ |
| 14-6-2024 | శుక్రవారము | దప్పర ఉత్సవం |
| 15-6-2024 | శనివారము | ఏనుగు వాహనము |
| 16-6-2024 | ఆదివారము | సింహవాహనోత్సవము |
| 17-6-2024 | సోమవారము | పులివాహన ఉత్సవము |
| 18-6-2024 | మంగళవారము | అశ్వ ఉత్సవము |
| 19-6-2024 | బుధవారము | పులివాహన ఉత్సవము |
| 20-6-2024 | గురువారము | సింహవాహన ఉత్సవము |
| 21-6-2024 | శుక్రవారము | కళ్యాణోత్సవము |
| 22-6-2024 | శనివారము | వసంతోత్సవము, గంగోత్సవము |
| 23-6-2024 | ఆదివారము | తీర్థవారి సముద్రస్నానం, రథోత్సవము, ధ్వజ అవరోహణ |
| 24-6-2024 | సోమవారము | తెప్పోత్సవము |

శ్రీ అమ్మవారి సేవలో....

బండి శాంతయ్య

కార్యనిర్వాహణాధికారి

మరియు

దేవస్థాన సిబ్బంది

## 18న వారణాసిలో మోడీ పర్యటన

మొదటిపేజీ తరువాయి..

మీడియా సమావేశంలో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఈ వివరాలను వెల్లడించారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ సమన్వయంతో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కరేంద్రమోదీ జూన్ 10న మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తూ పీఎం కిసాన్ నిధి 17వ ఇన్‌స్టాల్‌మెంట్ కింద రూ.20,000 కోట్లు విడుదల చేసేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. తద్వారా 9.3 కోట్ల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. 2019 ఫిబ్రవరిలో ప్రారంభించిన ఈ పథకం కింద రైతుల ఆధార్ సీడెడ్ బ్యాంక్ అకౌంట్లకు నేరుగా రూ.6,000 వార్షిక మొత్తంగా జమ అవుతుంది. ఒక్కో ఇన్‌స్టాల్‌కు రూ.2,000 చొప్పున మూడు ఇన్‌స్టాల్‌మెంట్స్‌గా ఈ మొత్తాన్ని జమచేస్తారు. కాగా, 17వ ఇన్‌స్టాల్‌మెంట్‌గా రూ.20,000 కోట్లు విడుదల చేసే కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 2.5 కోట్ల మంది రైతులు పాల్గొంటారని శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. వారణాసిలో ప్రధాని 'సింగిల్ క్లిక్'తో బటన్ నొక్కిన వెంటనే 9.26 కోట్ల మంది రైతు లబ్దిదారులకు ఆ మొత్తం చేరుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతులను చైతన్యవంతులను చేసేందుకు దేశవ్యాప్తంగా 732 కృషి విజ్ఞాన్ కేంద్రాలు, లక్షకు పైగా ప్రైమరీ అగ్రికల్చరల్ కోఆపరేటివ్ సొసైటీలు, 5 లక్షల కామన్ సర్వీస్ సెంటర్లు పాల్గొంటాయని మంత్రి తెలిపారు.

## ప్రజలకు కర్నాటక కాంగ్రెస్ షాక్

మొదటిపేజీ తరువాయి..

నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వాహనదారులకు గట్టి షాకిచ్చింది. పెట్రోల్, డీజిల్‌పై రాష్ట్ర పరిధిలోని సేల్స్ ట్యాక్స్‌ను పెంచింది. దీంతో వీటి ధరలు రూ.3 మేర పెరిగాయి. ఈ పెంపు తక్షణమే అంటే శనివారం నుంచే అమల్లోకి వస్తుందని ప్రభుత్వం వెల్లడించింది. ఈమేరకు శనివారం నోటిఫికేషన్ విడుదల చేసింది. పెట్రోల్‌పై కర్ణాటక సేల్స్ ట్యాక్స్‌ను 25.92శాతం నుంచి 29.84శాతానికి పెంచారు. ఇక, డీజిల్‌పై అమ్మకం పన్నును 14.3 శాతం నుంచి 18.44 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు ఆ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. తాజా పెంపుతో రాష్ట్రంలో లీటర్ పెట్రోల్ ధర రూ.3, డీజిల్ ధర రూ.3.05 మేర పెరుగుతున్నట్లు కర్ణాటక పెట్రోలియం డీలర్స్ అసిసోయేషన్ తెలిపింది. దీంతో బెంగళూరులో లీటర్ పెట్రోల్ ధర రూ.102.86, డీజిల్ ధర రూ.88.94కు చేరింది. ఈ పెంపుతో రాష్ట్ర ఖజానాకు ఏటా రూ.2,500-2,800 కోట్ల మేర ఆదాయం సమకూరనున్నట్లు కర్ణాటక



ఆర్థికశాఖ వర్గాలు చెబుతున్నాయి. చివరిసారిగా రాష్ట్రంలో 2021 నవంబరులో అప్పటి భాజపా సర్కారు పెట్రోల్, డీజిల్ ధరలను సవరించింది. కొవిడ్ తర్వాత ప్రజలకు ఊరట కల్పించేందుకు పెట్రోల్‌పై రూ.13.30, డీజిల్‌పై రూ.19.40 మేర తగ్గించింది. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ధరలను సవరించడం మళ్లీ ఇప్పుడే. కాగా.. లోక్‌సభ ఎన్నికలు పూర్తయిన వెంటనే చమురు ధరల పెంపుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఈ పెంపు తక్షణమే అమల్లోకి వస్తుందని ఆ నోటిఫికేషన్‌లో పేర్కొంది. ప్రభుత్వ నోటిఫికేషన్ అందుకున్న 'అఖిల కర్ణాటక ఫెడరేషన్ ఆఫ్ పెట్రోలియం ట్రేడర్స్'.. నోటిఫికేషన్‌కు అనుగుణంగా పెట్రో రేట్లను సవరించినట్లు వెల్లడించింది.

## అక్రమ రవాణాపై ఉక్కు పాదం



మొదటిపేజీ తరువాయి..

అన్నారు. ప్రజల సమస్యలు స్వయంగా చూశానని, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, తాగు నీరు అందించడంపై ప్రత్యేక దృష్టి పెడతానని అన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా తాను నిర్వర్తించబోయే శాఖలు తన మనసుకు, జనసేన మూల సిద్ధాంతాలకు చాలా దగ్గరగా ఉన్నాయని తెలిపారు. శాఖలన్నీ ప్రజలకు ప్రత్యక్షంగా ఉపయోగపడేవి, ప్రభుత్వాన్ని ప్రజల దగ్గరకు చేర్చేవిగా తాను భావిస్తున్నానని అన్నారు. శనివారం సచివాలయంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ... 2014 నుంచి తాను రాష్ట్ర వ్యాప్తంగా చేసిన పర్యటనల సందర్భంగా అనేక కష్టాలు కన్నీళ్లు చూశానని చెప్పారు. ఆడపడుచులు గుక్కెడు నీళ్ల కోసం పడుతున్న అవస్థలు తనకు ఆవేదన కలిగించాయన్నారు. ఉపాధి హామీ నిధులను సద్వినియోగం చేసుకోవడం, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా ప్లలెలకు రక్షిత తాగునీరు అందించి ప్రజల దాహార్తి తీర్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పర్యావరణాన్ని పరిరక్షించే అభివృద్ధి ప్రస్థానం' అనేది జనసేన మూల సిద్ధాంతాల్లో ఒకటి అని చెప్పారు. పారిశ్రామిక అభివృద్ధి వేగంగా జరగాలని.. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పుష్కలంగా అందాలని కోరుకున్నారు. ఆధునిక సాంకేతికత మేళవించిన సురక్షితమైన పారిశ్రామిక అభివృద్ధి ఈ సమాజానికి అవసరమని చెప్పుకొచ్చారు. విశాఖ ఎల్జీ పాలిమర్స్ ప్రమాదాన్ని మనం ఏనాడూ మరచిపోలేమని అన్నారు. ప్రజల ఆరోగ్యాలను హరించివేయకుండా పరిశ్రమలు ఆధునిక సాంకేతికను అందిపుచ్చుకునేలా పరిశ్రమలు ముందుకు వెళ్లడానికి చేయూతనిస్తామన్నారు. భూతాపాన్ని తగ్గించడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేస్తున్న ప్రయత్నాలకు బాసటగా నిలుస్తామని వివరించారు. గ్రీన్ ఎనర్జీని ఉపయోగించుకునేలా పరిశ్రమలను ప్రోత్సహిస్తామని చెప్పారు. వృక్షో రక్షతి రక్షితః అనే సూక్తి తన మదిలో ఎప్పుడూ మార్మోగు తుంటుందన్నారు. అడవుల విధ్వంసమే కరువు కాటకాలకు హేతువు. అలాంటి అడవులను కంటికి రెప్పలా కాపాడతామని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. మంత్రివర్గంలో తనకు కేటాయించిన శాఖలు జనసేన మూల సిద్ధాంతాలకు, తన మనసుకు దగ్గరగా ఉన్నాయని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. కీలక శాఖలు కేటాయించినందుకు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిగా రాష్ట్ర ప్రజలకు సేవ చేసే భాగ్యం దక్కిందని తెలిపారు. తనకు కేటాయించిన శాఖలపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఉపాధి హామీ నిధుల సద్వినియోగం, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తానని పవన్ వెల్లడించారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా గ్రామాలకు తాగునీరు అందించేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. గ్రీన్ ఎనర్జీని ఉపయోగించుకునేలా పరిశ్రమలను ప్రోత్సహిస్తానని పేర్కొన్నారు. అటవీ సంపదను కాపాడి, పచ్చదనాన్ని పెంచుతామని చెప్పారు. ఎర్రచందనం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. తీర ప్రాంతాల్లో మడ అడవుల సంరక్షణకు ప్రత్యేకంగా దృష్టి సారిస్తామన్నారు. నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్‌కు ప్రజా ప్రయోజన శాఖల బాధ్యతలు అప్పగించడం పట్ల పవన్ సంతృప్తి వ్యక్తం చేశారు. పర్యాటక ప్రాజెక్టుల ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపర్చేందుకు కృషి చేస్తామన్నారు. సినీ రంగానికి రాష్ట్రంలో స్నేహపూరిత వాతావరణం నెలకొల్పుతామని వివరించారు. సినీ పరిశ్రమకు కావాల్సిన మౌలిక వసతులను కల్పించడంతోపాటు ఆ రంగంలో యువతకు ఉపాధి అవకాశాలు దక్కేలా చూస్తానని పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారు.

## కార్యకర్తల అలుపెరగని శ్రమ



మొదటిపేజీ తరువాయి..

అసెంబ్లీ సమావేశాలు ఎప్పటి నుంచీ నిర్వహించేది త్వరలోనే నిర్ణయిస్తామని చంద్రబాబు పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారి కోసం త్వరలోనే నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తానని తెదేపా అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి ఆయన మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా పార్టీ నేతలతో టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, బూత్‌స్థాయి కార్యకర్తలు ఇందులో పాల్గొన్నారు. కింది స్థాయి నుంచి ఎవరు ఎక్కడ పార్టీ కోసం పని చేశారో వారికే పదవులు దక్కేలా అధ్యయనం ప్రారంభించామని ఈ సందర్భంగా చంద్రబాబు స్పష్టం చేశారు. నేతలు, కార్యకర్తలు సాధికారత సాధిస్తే పార్టీ పునాదులు బలంగా ఉంటాయని పేర్కొన్నారు. అన్న క్యాంటీన్లు ఎక్కడెక్కడ మూతపడ్డాయో వాటిని వందరోజుల్లోనే తెరిపించే కార్యక్రమం ఉంటుందన్నారు. గత 20 ఏళ్లలో ఎన్నడూ గెలవని సీట్లలో కూడా ప్రజలు తెదేపాకి అధికారాన్ని కట్టబెట్టారంటే అది వారు పెట్టుకున్న నమ్మకమని చెప్పారు. కూటమికి 93 శాతం స్ట్రైక్ రేట్, 57 శాతానికిపైగా ఓట్లు వచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. కూటమిలోని మూడు పార్టీల పాత్ర ఎంతో కీలకంగా పనిచేసిందన్నారు. ఈ ఘన విజయానికి కారణమైన కార్యకర్తల రుణం తప్పకుండా తీర్చుకుంటానని చంద్రబాబు స్పష్టం చేశారు. ఐదేళ్ల పాటు కార్యకర్తలు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. అధికారం ఉందని కక్ష సాధింపులు, ప్రజా వ్యతిరేక పనులు చేయవద్దని సూచించారు. ఎమ్మెల్యేలు, నేతలు.. కింది స్థాయి కార్యకర్తలను విస్మరించకూడదన్నారు. బాధ్యతగా, చిత్తశుద్ధితో పనిచేస్తే ప్రజలు మళ్లీ ఆదరిస్తారని దిశానిర్దేశర చేశారు. ధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించడం వెనుక నాయకులు, కార్యకర్తల అలుపెరగని శ్రమ, అపార కృషి ఉందని తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభిప్రాయ పడ్డారు.

గత 20 ఏళ్లలో గెలవని చోట గెలిచామని, ఈ విజయం కార్యకర్తలకు అంకితం చేస్తున్నానని ప్రకటించారు. ప్రజలు నమ్మకంతో చారిత్రాత్మక తీర్పు ఇచ్చారని వివరించారు. 93 శాతం స్ట్రైట్ రేట్‌తో 57 శాతం ఓట్ షేర్‌ను కూటమి సాధించిందన్నారు. తెలుగు దేశం పార్టీ నేతలు, కార్యకర్తలతో శనివారం చంద్రబాబు టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. కూటమి విజయానికి కారణమైన కార్యకర్తలు, నేతలకు ధన్యవాదాలు తెలియజేశారు. 'ఎనిమిది ఉమ్మడి జిల్లాల్లో కూటమి క్లీన్ స్వీప్ చేసింది. ఈ విజయం వెనక నేతలు, కార్యకర్తల ఐదేళ్ల కష్టం ఉంది. గాజువాక, భీమిలి, మంగళగిరిలో 90 వేలకు పైగా మెజారిటీ వచ్చాయి. పెందుర్తి, నెల్లూరు సిటీ, తణుకు, కాకినాడ రూరల్, రాజమండ్రి సిటీ, విశాఖపట్నం ఈస్ట్, పిఠాపురం నియోజకవర్గాల్లో 70 వేలకు పైగా మెజారిటీ వచ్చింది. కార్యకర్తలు, నేతలు పోటీ పడి పని చేయడంతో ఈ ఫలితాలు వచ్చాయి. విశాఖపట్టణం, శ్రీకాకుళం, అమలాపురం, గుంటూరు లోక్ సభ స్థానాల్లో 3 లక్షలకు పైగా మెజారిటీ వచ్చింది. ఐదేళ్లలో మీరు పడిన కష్టాలు గుర్తుంటాయి. ఎన్నికల్లో కార్యకర్తల పాత్ర మరచి పోలేనిది. పసుపు జెండా పట్టుకుంటే చెయ్యి విరగొట్టారు. జై తెలుగుదేశం అంటే గొంతు కోశారు. అయినా కార్యకర్తలు బెదరలేదు.

పార్టీ కోసం ప్రాణాలు త్యాగం చేశారు. మరికొందరు ఆస్తులు కోల్పోయారు. ఇంకొందరు జైలుకు వెళ్లారు. కార్యకర్తల కష్టాలు, వేధింపులు, అక్రమ కేసులు, హత్యలు, అరెస్టులు చూసి నిద్ర లేని రాత్రులు గడిపాను. మీ త్యాగం నా జీవితంలో మర్చిపోలేను. ఎవరు...ఎక్కడ ఏం పని చేశారో అధ్యయనం చేస్తున్నాం. కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు ఏం చేయాలి అనే విషయంలో ఆలోచన చేస్తున్నాం. అధికారం వచ్చిందని కక్షసాధింపు చర్యలకు పాల్పడటం, విర్రవీగడం చేయవద్దు. ఎమ్మెల్యేలు, నాయకులు కార్యకర్తలను విస్మరించ కూడదు. ప్రజలు తప్పుపట్టేలా ఎలాంటి పనులు చేయొద్దు. ఈ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన మెజారిటీని కాపాడుకోవాలి. రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ ఇంతటి తీర్పు ఇవ్వలేదు. కూటమి విజయానికి సహకరించిన ప్రజలకు మేలు చేయాలి అని' చంద్రబాబు స్పష్టం చేశారు. 'ఎన్నికల ముందు సూపర్-6, ప్రజాగళం మేనిఫెస్టోలో ప్రకటించాం.. ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తాం. మెగా డీఎస్సీ ఫైలుపై సంతకం చేసి, 16,347 ఉద్యోగాల భర్తీకి ఆదేశాలు ఇచ్చాం. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై రెండో సంతకం, పెన్షన్ రూ.4 వేలకు పెంపుపై మూడో సంతకం, స్కిల్ గణనపై నాలుగో సంతకం, అన్నా క్యాంటీన్ పునరుద్ధరణపై ఐదో సంతకం చేశాం. యువతలో నైపుణ్యం ఏ మేరకు ఉందో గణన చేసి అవసరమైన అవకాశాలు కల్పిస్తాం. నైపుణ్య గణనతో జీవన ప్రమాణాలను మార్చడానికి అవకాశం ఉంటుంది.

2014-2019 మధ్య నెలకొల్పిన అన్న క్యాంటీన్లను వంద రోజుల్లో ఏర్పాటు చేస్తాం. ప్రజల జీవన ప్రమాణ స్థాయి మార్చేలా పథకాలు అమలు చేస్తాం. 2047 నాటికి దేశం స్థితిగతులు మారాలి. తెలుగువారు నెంబర్-1 ఉండాలనేది నా ఆకాంక్ష. అందుకోసం కష్టపడతాను. పార్టీ కార్యకర్తలకు గౌరవం, ప్రాధాన్యం ఉండేలా నేతలు నడుచుకోవాలి. కష్టపడి పనిచేసిన వారికి నామినేటెడ్ పోస్టుల్లో భర్తీ చేస్తాం. నేను తరుచూ పార్టీ కేంద్ర కార్యాలయానికి వెళతాను. జిల్లాలకు వెళ్లినప్పుడు కార్యాలయాలకు వెళతాను. నేతలు జిల్లాపార్టీ కార్యాలయానికి వెళ్లాలి. కార్యకర్తలకు అందుబాటులో ఉండాలి. ప్రభుత్వాన్ని సమర్థవంతంగా నడపడంతో పాటు పార్టీని బలోపేతం చేస్తాం. కార్యకర్తలకు అందుబాటులో ఉండి వారి ఇబ్బందులు పరిష్కరిస్తేనే వారిలో మనో ధైర్యం పెరుగుతుంది. గతంలో కార్యకర్తల సంక్షేమ నిధి ఏర్పాటు చేసి సాయం అందించాం. ఇక ముందు ఆదుకుంటాం. ఇప్పటికే ప్రజాపాలనకు శ్రీకారం చుట్టాం. పాజిటివ్ గవర్నెన్స్ ను తీసుకొస్తున్నాం అని' చంద్రబాబు తేల్చిచెప్పారు.

## వందేభారత్‌లో ఇక బెర్తులు

మొదటిపేజీ తరువాయి..

కోచ్ రైళ్లకు సంబంధించి ఓ ప్రకటన చేశారు. మరో రెండు నెలల్లోనే వందే భారత్ స్లీపర్ రైలు పట్టాలపై పరుగులు తీయనుందన్నారు. మరోవైపు వెయిటింగ్ లిస్ట్ సిస్టమ్‌కు పరిష్కారం కోసం రైల్వే శాఖ ప్రయత్నిస్తోందని అన్నారు. రైళ్ల సంఖ్య, బెర్తుల సంఖ్య పెంచడం ద్వారా వెయిటింగ్ లిస్ట్ సమస్య పరిష్కారమవుతుందని అన్నారు. మరో 60 రోజుల్లోనే వందే భారత్ స్లీపర్ రైళ్లు అందుబాటులోకి రానున్నట్లు అశ్విని వైష్ణవ్ తెలిపారు. వందే భారత్ స్లీపర్ రైలు పట్టాలపై పరుగులు తీయడానికి సిద్ధంగా ఉందని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఇప్పటికే ఈ రైళ్ల కోసం రెండు ప్రత్యేక ట్రాక్‌లను సిద్ధం చేశామన్నారు. ఈ రెండు ట్రాక్‌లపై ట్రయల్స్ పూర్తైన తర్వాత ప్రయాణీకులకు వందే భారత్ స్లీపర్ రైళ్లు అందుబాటులో రానున్నట్లు తెలిపారు. ప్రయోగ దశలో నాలుగు స్లీపర్ క్లాస్ కోచ్‌లతో రైలును సిద్ధం చేసినట్లు తెలిపారు.రానున్న ఐదేళ్లలో సుమారు 400 వందే భారత్ రైళ్లు అందుబాటులోకి రానున్నట్లు రైల్వే మంత్రి తెలిపారు.

## మంత్రి పవన్‌కు వదినమ్మ గిఫ్ట్

మొదటిపేజీ తరువాయి..

మోంట్‌బ్లాంక్ పెన్నును బహుమతిగా ఇచ్చారు. ఇందుకు సంబంధించిన వీడియోను చిరంజీవి తన సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకున్నారు. సురేఖ స్వయంగా పెన్నును తీసి, పవన్ జేబులో పెట్టగా అది చూసి పవన్ తెగ సంతోషపడ్డారు. అప్పటికే ఆయన వద్ద ఉన్న పెన్ను తీసి చూపించగా, 'ఇది కూడా అట్టిపెట్టుకో' అన్నట్లు సురేఖ చెప్పారు. ఆ వెంటనే ఒకవైపు నుంచి చిరంజీవి, మరోవైపు నుంచి పవన్ సతీమణి అన్నాలెజినోవా వచ్చి ఫొటో దిగారు. 'తెలుగు ప్రజల ఆకాంక్షల్ని నిజం చేస్తావని ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ.. వదిన, అన్నయ్య' అంటూ చిరంజీవి వీడియోను ముగించారు. ప్రస్తుతం ఈ వీడియో సామాజిక మాధ్యమాల వేదికగా వైరల్ అవుతోంది. అత్యంత ఖరీదైన విలాసవంతమైన ఉత్పత్తులను మోంట్‌బ్లాంక్ అందిస్తుంది. లగ్జరీ పెన్నులు, రీఫిల్స్, బ్యాగ్స్, లెదర్ వస్తువులు, వాచీలు, సెంట్స్ తదితర గిఫ్ట్‌లను తయారుచేస్తుంది. వీటి ఖరీదు కూడా అంతే ఎక్కువగా ఉంటుంది. సురేఖ.. పవన్‌కు ఇచ్చిన మోంట్ బ్లాంక్ డిస్నీ ఎడిషన్ పెన్నుల ధరల శ్రేణి రూ.90 వేల నుంచి రూ.2.60లక్షల వరకూ ఉంది.

## ప్రోత్సాహకాలతోనే పరిశ్రమలకు ఊతం

మొదటిపేజీ తరువాయి..

2024వరకు ఏపీ ప్రభుత్వంతో ఎంవోయూలు చేసుకున్న వారు రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పేలా చేయడమే తన మొదటి కర్తవ్యం అని తెలిపారు. మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ..'రాష్ట్రాలు పరిశ్రమలకు రాయితీలు ఇవ్వడం సహజం, కానీ సబ్సీడీలు ఎవరు ఫర్‌ఫెక్ట్‌గా ఇస్తున్నారనేదే ముఖ్యం. పారిశ్రామికవేత్తగా నాకు అనుభవం ఉంది. సబ్సీడీలపై వారికి నమ్మకం కలిగించాలి. ఆ పని టీడీపీ ప్రభుత్వం చేస్తుంది. సబ్సీడీలు ఇవ్వడం వల్లనే అమర్ రాజా కంపెనీ తెలంగాణకు వెళ్లిపోయింది. పరిశ్రమలకు అవసరమయ్యే ముడి సరకు ఏయే ప్రాంతాల్లో ఉందో గుర్తిస్తాం. రా మెటీరియల్ సరఫరా, రోడ్లు, నీరు, ఇతర సదుపాయాలు కల్పిస్తే ఇండస్ట్రీయల్ జోన్ క్రియేట్ అయ్యి డెవలప్మెంట్ జరుగుతుంది. చంద్రబాబు గత ప్రభుత్వంలో కర్నూలు జిల్లా ఓర్వకల్లుకు జయరాత్ ఇస్పాత్‌ను తీసుకొచ్చారు. కానీ వైసీపీ ప్రభుత్వంలో రాయితీల విషయంలో కంపెనీ అనేక సమస్యలు ఎదుర్కొంది. గుజరాత్ మాదిరిగా ఏపీలో కంపెనీలు పెట్టేందుకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తాం. ఇక జిల్లా ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకుంటూ అభివృద్ధిలో వారికి సహాయం చేస్తాను' అని చెప్పారు.

## జగన్ లోటస్‌పాండ్ ఇంటిముందు ఆక్రమణలు

మొదటిపేజీ తరువాయి..

తొలగిస్తున్నారు. నివాసం ముందున్న అక్రమ నిర్మాణాలను జీహెచ్‌ఎంసీ అధికారులు కూల్చివేశారు. లోటస్ పాండ్ వద్ద అక్రమంగా నిర్మించిన పోలీస్ సెక్యూరిటీ షెడ్లను జీహెచ్‌ఎంసీ తొలగించింది. రహదారికి అడ్డుగా ఉన్నాయన్న ఫిర్యాదుతో జీహెచ్‌ఎంసీ అధికారులు మూడు షెడ్లను కూల్చేశారు. అక్రమ నిర్మాణాలు తొలగించాలని లోటస్ పాండ్ సిబ్బందికి జీహెచ్‌ఎంసీ, పోలీసులు నిన్ననే ఆదేశాలు జారీ చేశారు. రహదారి పక్కనే అక్రమ నిర్మాణాలతో రాకపోకలకు ఇబ్బంది మారిందని ఫిర్యాదు అందడంతో ఈ మేరకు చర్యలు చేపట్టినట్లు అధికారులు పేర్కొన్నారు. రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై జీహెచ్‌ఎంసీ అధికారులకు సామాన్య ప్రజలు, వాహనదారులు ఫిర్యాదులు చేశారు. ఈ వరుస ఫిర్యాదులో రంగంలోకి దిగిన అధికారులు కూల్చివేతలు ప్రారంభించారు. కాగా.. పోలీస్ బందోబస్తు మధ్య జగన్ ఇంటి ముందు నిర్మాణాలను అధికారులు కూల్చివేసారు.

## స్పందనకు సరికొత్త రూపం

మొదటిపేజీ తరువాయి..

ప్రతి సోమవారం కలెక్టర్లు, అధికారులు ఫిర్యాదులను స్వీకరిస్తున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ తక్షణమే అమలుకు సీఎస్ నీరభ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదిలావుంటే మంగళగిరి ప్రజల కోసం 'ప్రజా దర్బార్' నిర్వహించినట్లు మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా చాలా సేవా కార్యక్రమాలు చేశామన్నారు. భారీ మెజార్టీతో గెలిచిన తనపై బాధ్యత మరింత పెరిగిందని తెలిపారు. నియోజకవర్గంలో అందుబాటులో ఉన్న రోజుల్లో ప్రజలను కలుస్తామని చెప్పారు. ఉదయం 8 గంటలకు ప్రజలను కలిసి వారి సమస్యలు తెలుసుకుంటామన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రత్యేక యంత్రాంగం ఏర్పాటు చేసినట్లు వివరించారు. నారా లోకేశ్ మంగళగిరి ప్రజల కోసం ఉండవల్లిలోని నివాసంలో ఉదయం 8 గంటల నుంచి 'ప్రజా దర్బార్' నిర్వహించారు. దీంతో సమస్యలు విన్నవించేందుకు నియోజకవర్గ ప్రజలు తరలివచ్చారు. వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వీలైనంత త్వరగా పరిష్కారానికి కృషి చేస్తామని లోకేశ్ వారికి హామీ ఇచ్చారు. ఆయా విభాగాల్లో చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇకపోతే పార్టీ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌కు ఇకపై తరచూ పార్టీ కార్యలయానికి వెళ్లేలా చంద్రబాబు ప్రణాళికలు సిద్ధం చేశారు. పార్టీ కార్యాలయంలో మంత్రులు కూడా అందుబాటులో ఉండేలా కార్యాచరణ చేశారు. పార్టీ - ప్రభుత్వం మధ్య సమన్వయానికి ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయనున్నారు.

## ఎపికి బ్రాండ్‌గా అమరావతి నిర్మాణం

మొదటిపేజీ తరువాయి..

నిర్మాణానికి కేవలం 58 రోజుల్లోనే 34 వేల ఎకరాలను రైతులు అందజేశారు. కేవలం అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబుపై నమ్మకంతోనే స్వచ్ఛందంగా రైతులు ముందుకొచ్చారు. గతంలో రూ.48వేల కోట్లతో రాజధాని ప్రాంతంలో అభివృద్ధి పనులకు టెండర్లు ఆహ్వానించాం. రూ.9వేల కోట్లతో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ తదితర మౌలిక వసతులు కల్పించాం. అనేక భవన నిర్మాణాలు వివిధ దశల్లోనే నిలిచిపోయాయి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మరోసారి రాజధానిని అభివృద్ధి చేసే బాధ్యతను నాపై ఉంచారు. ఆయన నమ్మకాన్ని నిలబెట్టేందుకు అహర్నిశలు శ్రమిస్తా. గత ప్రభుత్వం ప్రజలపై పన్నుల భారం మోపింది. చెత్తపన్నుతో సామాన్యులు బాగా ఇబ్బందులు పడ్డారు. నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు అత్యాధునిక టెక్నాలజీతో 11 లక్షల టిడ్కో ఇళ్లు నిర్మించాం. వాటిని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. త్వరలోనే అన్ని సౌకర్యాలతో ఆ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు కృషి చేస్తాం' అని నారాయణ తెలిపారు.

## విద్యార్థుల జీవితాలతో మోడీ చెలగాటం

### నీట్ అవకతవకలే ఇందుకు నిదర్శనం

### ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు వి.పి సాను

శ్రీకాకుళం,జూన్15(షణ్ముఖవెలుగు): విద్యార్థుల జీవితాలతో ప్రధాని నరేంద్ర మోడీ చెలగాటమాడుతున్నారని ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు వి.పి సాను అన్నారు. నీట్ పరీక్షల్లో చోటుచేసుకున్న అవకతవకలతో ప్రతిభావంతులైన విద్యార్థులు నష్టపోయారని, దీనికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. సమాజానికి, విద్యారంగానికి తీవ్ర నష్టం చేసే జాతీయ విద్యా విధానాన్ని తెరపైకి తెచ్చింది మోడీ ప్రభుత్వమేనని విమర్శించారు. శ్రీకాకుళం రూరల్ మండలం చింతాడలోని జి.ఎల్ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర ప్లీనరీలో ముఖ్య అతిథిగా ప్రారంభోపన్యాసం చేశారు. సమావేశం ప్రారంభ సూచికగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్ ఎస్ఎఫ్ఐ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాను మాట్లాడుతూ దేశ ప్రజలకు బిజెపి మతోన్మాదం నుంచి ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రానున్న కాలంలో రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకికవాదం ప్రమాదంలో పడనున్నాయని చెప్పారు. అయోధ్యలో రామమందిరం మీద ఉన్న శ్రద్ధ దేశంలో ఉన్న నిరుద్యోగ విద్యార్థి, యువజనులపై ఉంటే దేశ ప్రగతి కొంతమేరైనా సాధ్యపడేదన్నారు. యువతకు రెండు కోట్ల ఉపాధి అవకాశాలు కల్పిస్తానని చెప్పి మోసం చేశారని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం అయోధ్య రామ మందిరం పేరుతో మభ్యపెట్టేందుకు ప్రయత్నించినా, అయోధ్యలోని పైజాబాద్ నియోజకవర్గ ప్రజలు సైతం తిరస్కరించారని తెలిపారు.



విద్యారంగంలో సైతం కాషాయీకరణ చొప్పించి కలుషితం చేయాలని ప్రయత్నిస్తోందన్నారు. 400 స్థానాల్లో గెలిస్తే రాజ్యాంగాన్ని మార్చాలని చూసిన బిజెపికి ప్రజలు తగిన గుణపాఠం నేర్పారన్నారు. దేశం సర్వసత్తాక సౌమ్యవాద గణతంత్ర లౌకిక ప్రజాస్వామ్య దేశంగా పరిఢవిల్లాలంటే అది కేవలం విద్యార్థుల చేతుల్లోనే ఉందని, అందుకనుగుణంగా విద్యార్థులు పోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగినా పాలకుల విధానాలు మారవని అభిప్రాయపడ్డారు. నాణ్యమైన విద్య, ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పన, వసతిగృహ విద్యార్థుల సమస్యలపై పోరాటానికి కార్యాచరణ అమలు చేసి ఒక ప్రణాళిక ప్రకారం పోరాడాలని కోరారు. స్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని నూతన విద్యా విధానాన్ని ఎపిలోనే అమలు చేయడం ద్వారా గత ప్రభుత్వం విద్యారంగాన్ని భ్రష్టు పట్టించిందని విమర్శించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉత్తీర్ణతా శాతం దారుణంగా పడిపోయిందన్నారు. డిగ్రీలో ఆన్‌లైన్ ప్రవేశాలు, ఆనర్స్ కోర్సుకు ప్రవేశాలు వంటి కొత్త విధానాలు తీసుకురావడం వల్ల విద్యార్థులు తీవ్ర వ్యయప్రయాసలకు లోనవుతున్నారని చెప్పారు. సెల్ఫ్ ఫైనాన్స్ డే కోర్సులు తీసుకురావడం వల్ల డిగ్రీ చదువుపై విద్యార్థుల ఆసక్తి తగ్గిందన్నారు. వైసిపి ప్రభుత్వం అవలంభించిన అస్తవ్యస్త విధానాలను సరిచేయడంతో పాటు విద్యారంగం సమస్యలను పరిష్కరిస్తామని మేనిఫెస్టోలో పెట్టిన టిడిపి, ఆ హామీలను నిలబెట్టుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు అభ్యుదయ గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వినోద్, రామ్మోహన్, వెంకటేష్, ఎల్.జె నాయుడు, వెంకటేష్, కిరణ్ పరమేష్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.చందు, బి.హరీష్ తదితరులు పాల్గన్నారు.

## ప్రభుత్వ కార్యాలయాల్లో సిఎం, డిప్యూటీ ఫోటోలు

మొదటిపేజీ తరువాయి..

సీఎం చంద్రబాబు శనివారం ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఐ అండ్ పిఆర్ అధికారులకు సూచనలు చేశారు. తాజా నిర్ణయంతో ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సీఎం చంద్రబాబు నాయుడుతోపాటు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఫోటోలు ఉండనున్నాయి.సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో కూటమి విజయం సాధించిన విషయం తెలిసిందే. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు బాధ్యతలు స్వీకరించగా, ముఖ్యమంత్రిగా పవన్ కు బాధ్యతలను చంద్రబాబు అప్పగించారు. రాష్ట్రంలో వైసిపి ఓటమి సాధించడంలో, టిడిపి, జనసేన, బిజెపి నేతృత్వంలో కూటమి ఏర్పాటు కావడంలో పవన్ క్రియాశీలకంగా వ్యవహరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత పవన్ కు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. అందులో భాగంగానే ఉప ముఖ్యమంత్రి పదవితోపాటు కీలక శాఖలను పవన్ కు అప్పగించారు.పవన్ కళ్యాణ్ కు ఇచ్చిన పదవికి గౌరవాన్ని కల్పించే ఉద్దేశంతో మరొకరికి ఉప ముఖ్యమంత్రి పదవిని చంద్రబాబు ఇవ్వలేదు. తనతో పాటు సమానంగా పవన్ కు గౌరవాన్ని ఇవ్వాలని భావించిన చంద్రబాబు నాయుడు.. ఈ మేరకు ప్రభుత్వ కార్యాలయాల్లో పవన్ ఫోటో కూడా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం

# రాజకీయ అండతో రెచ్చిపోయిన ఆశా వర్కర్



తనను ఎవరూ ఏమీ చేయలేరంటున్న ఆశా వర్కర్
మానసిక వేధింపులు తాళలేక
ఏఎన్ఎం విజయ ఆత్మహత్యాయత్నం
రెండేళ్ళుగా వేధింపులు
కుటుంబానికన్నా వృత్తికే ప్రాధాన్యతనిచ్చిన వైనం
వేధింపులు తెలిసినా పట్టించుకోని స్థానిక ప్రభుత్వ వైద్యాధికారులు
ఆత్మహత్య చేసుకున్నా అటువైపు కన్నెత్తి చూడని ప్రభుత్వ వైద్యులు
తోడుగా నిలిచిన స్థానిక ఏఎన్ఎం, సూపర్ వైజర్

4

# ఈ విజయం కార్యకర్తల సమిష్టి కృషి ఫలితమే ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జూన్ 15)
మార్కాపురం పట్టణంలోని జవహర్ నగర్‌లోని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి స్వగృహం వద్ద మార్కాపురం పట్టణ మార్కాపురం మండల తర్లుపాడు మండలాల తెలుగుదేశం పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి విచ్చేసి కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రతి కార్యకర్త తమ పరిధి మేరకు శక్తివంచన లేకుండా నా విజయానికి తోడ్పడ్డారని వారందరికీ పేరుపేరున కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు. రాష్ట్రంలో వైసీపీ పార్టీ ఘోర (తరువాయి 4లో...)

# ప్రజా పాలన అందిస్తాం

## ఎమ్మెల్యే ఉగ్ర

(షణ్ముఖ వెలుగు, కనిగిరి, జూన్ 15)
నియోజకవర్గంలో ప్రజా పాలన అందించి ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటానని కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. కనిగిరి, వెలిగండ్ల మండలాల్లో శనివారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కనిగిరి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా ప్రమాణాల మెరుగుకు ఉపాధ్యాయులు (తరువాయి 4లో...)



# డయాలసిస్‌లో ఆయుర్వేద డాక్టర్

గత 9నెలలుగా ఎంబీబీఎస్ డాక్టర్‌ను
నియమించని నెప్రోప్లస్ కంపెనీ యాజమాన్యం
సరైన వైద్యసాయం లేక మృత్యువాత పడుతున్న రోగులు
ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర ఆకస్మిక తనిఖీలో బయటపడ్డ వాస్తవాలు





(షణ్ముఖ వెలుగు, కనిగిరి, జూన్ 15)
రాష్ట్రంలో ఉద్దానం తర్వాత స్థానంలో ఎక్కువ డయాలసిస్ రోగులున్న ప్రాంతం కనిగిరి. అధికారికంగా కనిగిరి డయాలసిస్ సెంటర్ దాదాపు 120 మంది డయాలసిస్ చేయించుకుంటున్నారు. కనిగిరి, పీసీపల్లి, సీఎస్‌పురం, పామూరు, వరికుంటపాడు, నెల్లూరు జిల్లాల నుండి కూడా వచ్చి కనిగిరిలో డయాలసిస్ చేయించుకుంటారు. అధికారిక లెక్కల ప్రకారం సుమారు 1400 కేసులు జరుగుతున్నాయి. 17 మిషన్లతో రోజుకు 4 షిఫ్టులు జరుగుతున్నాయి. ఇదిలా ఉండగా డయాలసిస్ చేసే సమయంలో పేషెంట్లకు ఫిట్స్, హైబీపీ, ఖోమాలోకి పోవడం వంటి ఆకస్మిక లక్షణాలు వస్తుంటాయి. ఈ సమయంలో ఎంబీబిఎస్ డాక్టర్ దగ్గరుండి వైద్యసలహాలు ఇస్తూ వారికి వెన్నుదన్నుగా ఉండాలి. డయాలసిస్ నిర్వహించే నెప్రోప్లస్ కంపెనీ ప్రభుత్వంతో జరిగిన ఒప్పందం ప్రకారం ఒక ఎంబీబీఎస్ డాక్టర్ ను నియమించాలి. వందలాది రోగులున్న కనిగిరి ప్రాంతం నుండి సుమారు నెలకు రూ.20లక్షలు ఆదాయం ఆర్జిస్తున్న నెప్రోప్లస్ (తరువాయి 4లో...)






# రాజకీయ అండతో రెచ్చిపోయిన ఆశా వర్కర్





(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 15)

సుదీర్ఘ కాలం వైద్య వృత్తిలో ఉంటూ ఏఎన్ఎం గా పొదిలి నగర పంచాయతీ అధికారులు, జిల్లా స్థాయి నుంచి మండల స్థాయి వరకు ఉన్న వైద్యారోగ్యశాఖ అధికారులు, సిబ్బంది కి సుపరిచితురాలు, యూనియన్‌లో మంచి స్థానంలో ఉన్న విజయ శనివారం గత రెండు సంవత్సరాలుగా తనను వేధిస్తున్న ఆశా వర్కర్ వేధింపులు పెరిగిపోవడంతో ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే ఏఎన్ఎం విజయ అంటే తెలియని వారు పొదిలి మండలంలో లేరని చెప్పడంలో ఏ మాత్రం సందేహం లేదు. ఏఎన్ఎంగా తన సేవలు ఎంతో మందికి అందించి అటు అధికారులు, ఇటు ప్రజలతో శభాష్ అని అనిపించుకుంది. ప్రభుత్వం నిర్వహించే ఏ కార్యక్రమమైనా తన భుజస్కంధాలపై వేసుకుని ఆమె తన బాధ్యత నిర్వర్తించేది. సేవా గుణంతో పాటు మంచితనానికి మారు పేరుగా స్థానిక ప్రజలు చెప్పడం గమనార్హం. సాధారణంగా ప్రభుత్వ అధికారులు, సిబ్బంది అంటే ప్రజలు ఏదో ఒక సమయంలో వారి పై ఆరోపణలు చేస్తుండడం మనం చూస్తుంటాము. కానీ గత 15 సంవత్సరాలకు పైగా ఆమె ఏఎన్ఎం గా సేవలు అందిస్తున్నా తాను ఎక్కడ పని చేసినా అక్కడి ప్రజలు, అధికారుల మన్ననలు పొందిందనడంలో ఏ మాత్రం సందేహం లేదు. అలాంటి మంచి సేవలు అందించే ఆమెకు తోటి ఆశా వర్కర్ వేధింపులు హెచ్చుమీరాయి. గత రెండు సంవత్సరాలుగా సదరు ఆశా వర్కర్ వేధింపులు తీవ్రతరమయ్యాయి. పలు మార్లు స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా ఫలితం లేకుండా పోయింది. అయినా వాటన్నింటిని పట్టించుకోకుండా తన వృత్తి ధర్మం నిర్వహిస్తుంది. శనివారం మండలంలోని బుచ్చనపాలెం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో సదరు ఆశా వర్కర్ తనకు రాజకీయ పలుకుబడి ఉందని, తనను ఎవరూ ఏమీ చేయలేరని ఇష్టానుసారంగా ఏఎన్ఎం విజయ పై విరుచుకుపడింది. ఓ కార్యక్రమంలో అందరి ముందు అలా ఆశా వర్కర్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడడంతో మనస్థాపానికి గురైన ఏఎన్ఎం తన ఇంట్లో ఉన్న పలు మందులను మింగి ఆత్మహత్యకు పాల్పడింది. వెంటనే ఆమె భర్త విషయం తెలుసుకుని హుటాహుటిన తొలుత ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న సదరు ఆశా వర్కర్ ఇలాంటి డ్రామాలు చాలా చూశాము...మాత్రలు మింగితే చనిపోతారా అంటూ వ్యాఖ్యానించిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే విషయం తెలిసినా కనీసం శనివారం రాత్రి వరకు స్థానిక వైద్యులు కనీసం సదరు ఏఎన్ఎం చూసి పరామర్శించిన దాఖలాలు లేవంటే వైద్య వృత్తిలో సేవ చేసే వారికి వైద్యులు ఇచ్చే కనీస విలువ ఇదేనా అంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. సొంత శాఖలో ఓ వ్యక్తి కి కష్టం వస్తే కనీసం పలుకరించలేని స్థితిలో ఆ శాఖ ఉన్నతా ధికారులున్నారంటే ఇక సేవ చేసే వారి కంటే ఇలా వచ్చి అలా వెళ్ళే సిబ్బందికే అధికారులు వత్తాసు పలుకు తున్నారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి తక్షణమే ఈ విషయం పై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోకుంటే ఇక సేవ చేసే వారు కూడా తూతూ మంత్రంగా పనులు చేసే పరిస్థితి దాపురించడం సాధారణం. ఇలాగా మరి కొందరు ఏఎన్ఎం లు కూడా స్థానికంగా ఉండే వారి పై అధికారుల వేధింపులకు గురువతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరి మరో ఘటన వెలుగు చూడకముందే జిల్లా వైద్యాధికారులు చర్యలు తీసుకుంటారో లేక మరో వ్యక్తి ఇలాంటి వేధింపులకు బలైతే గాని చర్యలు తీసుకోరో వేచి చూడాల్సిందే....! స్థానిక పోలీసులు ఆమె స్టేట్ మెంట్ రికార్డు చేసుకున్నారు.

**విజయను పరామర్శించిన కమిషనర్**

ఏఎన్ఎం విజయ భర్త అనిల్ నగర పంచాయతీలో శానిటేషన్ విభాగంలో మేస్త్రీ గా బాధ్యతలు నిర్వహిస్తుంటాడు. అనిల్ భార్య విజయ ఆత్మహత్య ప్రయత్నం చేసిందన్న విషయం తెలుసుకున్న నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి తన తోటి సిబ్బందితో కలిసి విజయను పరామర్శించి ధైర్యం చెప్పారు. నిరంతరం ప్రజలకు సేవ చేసే వృత్తిలో ఉంటూ ఇలాంటి ఘటనలకు పాల్పడడం సరైంది కాదని సూచించారు. మీ పిల్లలను గుర్తుంచుకుని అయినా మరో మారు ఇలాంటి ఘటనకు పాల్పడవద్దని ఆమెకు సూచించారు. ధైర్యంగా వృత్తిలో ముందుకు సాగాలని సూచనలు చేశారు. కమిషనర్ వెంట శానిటరి ఇన్స్‌పెక్టర్ మారుతీరావు, ఇతర సిబ్బంది ఉన్నారు.

# డయాలసిస్‌లో ఆయుర్వేద డాక్టర్

కంపెనీ ఎంబీబిఎస్ డాక్టర్ ని నియమించకుండా కాసులకు కక్కుర్తి పడి ఆయుర్వేద డాక్టర్ ను నియమించింది. ఎంబీబిఎస్ డాక్టర్ అయితే సుమారు రూ. 50వేల నుండి రూ. లక్ష వరకు డిమాండ్ చేస్తారనే ఉద్దేశ్యంతో రూ. 25వేలు నుండి రూ. 30 వేలకు అసలు దయాలసిస్ కు సంబంధం లేని , కనీసం నాడి పట్టడం, పల్స్ చూడడం, సూది వేయడం కూడా రాని ఆయుర్వేదం డాక్టర్ ను నియమించింది. దీనితో దయాలసిస్ రోగులకు వచ్చే జబ్బులకు సరైన వైద్య సాయం లేక రోగులు మృత్యువాతపడుతున్నారు. ప్రభుత్వానికి అందిన లెక్కల ప్రకారం సుమారు ఈ 9 నెలల్లో 20-30 రోగులు సరైన వైద్య సాయం లేక మృత్యువు భారిన పడ్డారు. కంపెనీ ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు దయాలసిస్ జరిగే సమయంలో రోగులు మృత్యువాత పడకుండా ఎంబీబిఎస్ డాక్టర్ వైద్య సాయం అందించాలి. కాని ఇటీవల ఇద్దరు పేషెంట్లు దయాలసిస్ జరిగే సమయంలో బెడ్ మీదనే మృత్యువాతపడ్డారు. కాని సిబ్బంది ఇదేమి బయటకు రాకుండా చూశారు. మృతుల బంధువులకు ఇదేమి తెలియకపోవడంతో సహజంగానే మృతి చెందారని సిబ్బంది మాటలకు తలూపారు. కాని నిజానికి సరైన వైద్యం అందకపోవడంతోనే మరణించినట్లు పేషెంట్లు నుండి అందిన సమాచారం.

**అర్హత లేని సిబ్బందితో దయాలసిస్**

కనిగిరి కేంద్రంలో అర్హత లేని సిబ్బందితో రోగులకు దయాలసిస్ చేయిస్తున్నట్లు సమాచారం. రోగులకు దయాలసిస్ చేయాలంటే దయాలసిస్ కోర్సు పూర్తి చేసి ఉండాలి. కాని ఇక్కడ పనిచేసే సిబ్బందిలో సగానికి పైగా సిబ్బంది దయాలసిస్ కోర్సు చేసి ఉండలేదు. నామమాత్రంగా నర్సింగ్ పూర్తి చేసిన వారిచే దయాలసిస్ చేయిస్తున్నారు. దీని వలన దయాలసిస్ పట్ల సరైన అవగాహన లేకపోవడంతో దయాలసిస్ చేయడంలో పాటించవలసిన ప్రమాణాలు పాటించడంలేదు. దీనితో రోగులు దయాలసిస్ చేయించుకునే సమయంలో రక్తాన్ని నేలపాలై అధికంగా రక్తాన్ని కోల్పోవాల్సి వచ్చిన సంఘటనలు అనేకం.

**నాడి పట్టడం, సూది వేయడం తెలియదు**

యాజమాన్యం నియమించిన వ్యక్తికి కనీసం నాడి పట్టడం, సూది వేయడం, పల్స్ చూడడం కూడా తెలియక పోవడంతో వైద్యం కోసం తరచూ రోగులు సిబ్బందితో గోడవలు పడాల్సి వచ్చేది. దయాలసిస్ కు సంబంధం లోని వ్యక్తిని డాక్టరుగా నియమించడంతో వారికి ఏ వైద్యం చేయాలి తెలియక సదరు డాక్టర్ దయాలసిస్ కేంద్రానికి వచ్చి పనిగంటల వరకు ఉండి వెళ్ళిపోతుంటారని సమాచారం. ఈ సమయంలో ఆయన నిద్రకు మాత్రమే ప్రాధాన్యతనిస్తున్నట్లు రోగులు వాపోతున్నారు.

ఎమ్మెల్యే ఉగ్ర ఆకస్మిక తనిఖీతో బయటపడ్డ వాస్తవాలు

కనిగిరికి నూతనంగా ఎమ్మెల్యేగా ఎన్నికైన డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి శుక్రవారం దయాలసిస్ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో నెఫ్రాలజి డాక్టర్ ఎక్కడ అని రోగులను, సిబ్బందిని విచారించడంతో అసలు విషయం బయటపడింది. ఎంబీబిఎస్ డాక్టర్ పేరుతో కాసులకు కక్కుర్తి పడి ఆయుర్వేదం డాక్టర్ ని నియమించినట్లు వెల్లడైంది. దీంతో ఆగ్రహించిన ఎమ్మెల్యే ఉగ్ర నెఫ్రాలజి డాక్టర్ ఉండాల్సింది ఆయుర్వేదం డాక్టర్ తో ఏమి పని అని, నేను మరలా తనిఖీకి వచ్చినప్పుడు నువ్వు ఉండకూడదని సూపరింటెండ్ కు ఆదేశాలిచ్చినట్లు సమాచారం.

**గత శాసనసభ్యులకు ఈ వ్యవహారం తెలియదా**

కాగా కనిగిరి దయాలసిస్ కేంద్రంలో గత 9నెలలుగా ఆయుర్వేదం డాక్టర్ నియామకం జరిగిన విషయం గత పాలకులైన బుర్రామధుసూధన్ యాదవ్ కు తెలియదా...లేక తెలిసినా కుడా పేద రోగులే కదా అని పట్టీ పట్టనట్లున్నాడా అంటూ కనిగిరిలో చర్చనీయాంశమైంది. అయితే ప్రజల ఆశీర్వాదంతో డాక్టర్ వృత్తిలో ఉన్న ఉగ్రను ఎమ్మెల్యేగా ఎన్నుకోవడంతో విషయం బయటపడింది. ప్రజల బాగోగులపై సరైన అవగాన లేని బుర్రాను ఎమ్మెల్యేగా ఎన్నుకోవడంతో రోగుల ఆరోగ్యాన్ని పట్టించుకోలేదని వారంటున్నారు. కాని అధికారంలోకి వచ్చిన డాక్టర్ ఉగ్ర వెను వెంటనే దయాలసిస్ సెంటర్‌ను తనిఖీ చేసి సదరు ఆయుర్వేద డాక్టర్‌ను గెంటివేసాడు. సదరు ఆయుర్వేద డాక్టర్ నియామకం పట్ల సదరు సెంటర్లు చూసుకునే ఇన్‌ఛార్జి పై చర్యలుంటాయా అని పేషెంట్ల ప్రశ్నిస్తున్నారు.

**సూపరింటెండెంట్ కలామ్ ఏమన్నారంటే**

ప్రభుత్వ నిబంధనల మేరకు దయాలసిస్ కు ఒక ఎంబీబిఎస్ డాక్టర్‌ను నియమించాలి. కాని ఇప్పుడున్న డాక్టర్ ఎంబీబిఎస్ డాక్టర్ అని నెప్రోప్లస్ కంపెనీ క్లస్టర్ ఇన్‌చార్జి తెలిపారన్నారు. దాంతో తామేమి పట్టించుకోలేదు. శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర పర్యటనలో వాస్తవ విషయం తెలిసింది. డాక్టర్‌ను నియమించడం మా పరిధి కాదని, నెప్రోప్లస్ యాజమాన్యం వారు నియమించిన వ్యక్తితో తాము పని చేయించుకోవాలి అని షణ్ముఖ వెలుగు ప్రతినిధికి తెలిపారు.

# ప్రజా పాలన అందిస్తాం



కృషి చేయాలన్నారు. ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా విద్యా భోదనలు ఉండాలన్నారు. పాఠశాలలో ప్రధాన సమస్యలుంటే వాటిని వెంటనే పరిష్కరిస్తామన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు జి సంజీవి, సుబ్బారావు, బివి నారాయణరెడ్డి, రాజాల కొండారెడ్డి, హెచ్‌ఎంల సంఘం నాయకులు దేవిరెడ్డి రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**వెలిగండ్ల.....** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల పరిషత్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాల్సిన బాధ్యత స్థానిక ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. ప్రతి సమావేశంలో ప్రజా ప్రతినిధులు అడిగిన సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. తాగు, సాగునీటి రంగాలపై దృష్టి పెడతామన్నారు. వెలిగొండ ప్రాజెక్టును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు త్వరితగతిన పూర్తి చేస్తారన్నారు. ఈ సమావేశంలో ఎంపిపి రామన లక్ష్మీ తిరుపతిరెడ్డి, జడ్పీటిసి సభ్యులు గుంటక తిరుపతిరెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఈ విజయం కార్యకర్తల సమిష్టి కృషి ఫలితమే ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి



ఓటమిపాలైన ఇప్పటికి బుద్ధి రాలేదని తెలుగుదేశం పార్టీ శ్రేణులు దాడి చేస్తున్నారని గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని తమ తమ దృష్టి అంతా అభివృద్ధిపైనే కేంద్రీకరించామని తెలుగుదేశం నాయకులకు ఎవరిపైన దాడులు చేసే ఉద్దేశం లేదని తమ నాయకుడు చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా, పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా, బిజెపి తెలుగుదేశం నాయకులు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారని అందరి దృష్టి రాష్ట్ర పునర్నిర్మాణం పైనే దృష్టి సారించారని, ఇక మార్కాపురం నియోజకవర్గంలో ప్రజల ఆశలకు అనుగుణంగా పనిచేసి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడుపుతానని కార్యకర్తలతో అన్నారు. ఈ సమావేశంలో మార్కాపురం నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ క్లస్టర్ ఇంచార్జ్ కందుల రామిరెడ్డి, మార్కాపురం పట్టణ తెలుగుదేశం నాయకులు, మార్కాపురం మండల తెలుగుదేశం నాయకులు, తర్లపాడు మండలాలు తెలుగుదేశం నాయకులు, తెలుగుదేశం కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు.



# ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభించిన ఎమ్మెల్యే కందుల

## మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహణ





(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జూన్ 15)

మార్కాపురంలోని ప్రెస్ క్లబ్‌లో మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో, శాంతిరాం కంటి ఆసుపత్రి కర్నూలు వారిచే నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి కంటి రోగులు పోటెత్తారు. మార్కాపురం ఎమ్మెల్యే మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి మరియు మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫారూఖ్ షుబ్లి ముఖ్య అతిథులుగా పాల్గొని ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫరూక్ షిబ్లీ మాట్లాడుతూ కంటి చూపు లేని వారికి కంటి చూపు తెప్పించే విధంగా ఈ శిబిరాన్ని నిర్వహించడం జరిగిందని ఆయన అన్నారు. రాష్ట్రంలో నెలకొని ఉన్న చీకట్లో తొలగిపోయి ప్రకాశవంతమైన చంద్రుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రూపంలో ఆంధ్ర రాష్ట్రానికి వెలుతురు నింపుతుందని ఆయన పాలనలో రాష్ట్రం సుభిక్షంగా సస్యశ్యామలంగా సర్వతోముఖ అభివృద్ధి వైపు పయనిస్తుందని ఫారూఖ్ షుబ్లి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరం ద్వారా దాదాపు 100 మందికి శాంతిరాం హాస్పిటల్ వారు కంటి ఆపరేషన్ కి తీసుకుని వెళ్లడం జరిగింది. ఈ కార్యక్రమంలో మార్కాపురం పట్టణ మైనార్టీ హక్కుల పరిరక్షణ కమిటీ అధ్యక్షులు మొగల్ జాబిర్ హుస్సేన్ బేగ్, కమిటీ సభ్యులు తాజ్, మహబూబ్ బాషా, షాకిర్ ,నాసర్, వలి, జిలాని, సత్తార్, కబీర్, షకీల్, తౌఫిక్, రఫీ, మహమ్మద్, కరిముల్లా, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామ్ మినరల్స్ యార్డు పై మైనింగ్ అధికారులు దాడులు



(షణ్ముఖ వెలుగు, చేజర్ల, జూన్ 15)

నెల్లూరు జిల్లా చేజర్ల మండలం ఆదురూపల్లి సమీపంలో ఉన్న జెడ్పీటీసీ సభ్యుడు పీర్ల పార్థసారధికి చెందిన శ్రీ రామ్ మినరల్స్ యాడ్ పై శనివారం అకస్మాత్తుగా మైనింగ్ అధికారుల దాడులు చేశారు. అక్కడ ఉన్న ప్రోక్లైన్‌తో పాటు యాడ్‌ని మైనింగ్ అధికారులు సీజ్ చేశారు. సంబంధిత యాడ్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడులలో చేజర్ల మండల తహశీల్దారు, స్థానిక మండల ఎస్సై ఎన్.ప్రభాకర్ పాల్గొన్నారు. ఇదంతా 579 సర్వే నంబర్లో పనిచేస్తున్న ప్రోక్లైన్ ఇల్లీగల్ స్టాక్‌ని తీసుకుని అక్రమంగా చేస్తున్నట్లు తేలడంతో సంబంధిత సర్వే నంబర్‌కు గల యజమానిపై కేసు నమోదు చేస్తున్నట్లు మైనింగ్ వారు తెలిపారు.

# మంత్రి నారాయణను మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్, ఎస్పీ

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జూన్ 15)



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి తొలిసారిగా నెల్లూరు నగరానికి విచ్చేసిన మంత్రి పొంగూరు నారాయణకు పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు. శనివారం ఉదయం నెల్లూరు రూరల్ మండలం చింతారెడ్డిపాలెంలోని మంత్రి నివాసంలో జిల్లా కలెక్టర్ ఎం.హరి నారాయణన్, ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్ మంత్రి నారాయణను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

# జీవి చౌదరిని అభినందించిన ఎస్పీ వకుల్ జిందాల్




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 15)

2024 సాధారణ ఎన్నికల్లో భాగంగా ప్రతిభ కనపరిచిన ఉద్యోగులకు బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ శనివారం అవార్డులను అందజేశారు. అందులో భాగంగా ఉత్తమ ప్రతిభ చూపిన యద్దనపూడి ఎస్ఐ జివి చౌదరికి బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ చేతుల మీదుగా అవార్డు అందజేశారు.

# పశువుల వధ నిర్మూలనికి సహకరించండి

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూన్ 15)
17వ తారీకు బక్రీద్ పండుగ సందర్భంగా గోవదను నిర్మూలించడానికి రవాణా శాఖ ఆధ్వర్యంలో గోవులను పశువులను రవాణా చేసే వాహనములను చెక్ చేసి పెనాల్టీ విధించడం జరుగుతుందని ఉప రవాణా కమిషనర్ ఆర్ సుశీల శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పశువులన తరలించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కనుక లారీ యజమానులు అక్రమ ట్రాన్స్‌పోర్ట్‌ను నిలుపుదల చేయాలని ఆదేశించారు. యజమానులు, డ్రైవర్లు సరియైన రికార్డులను వాహనంలో ఉంచుకొని ప్రయాణించాలని సూచించారు. జిల్లాలో మొత్తం 18 చెక్‌పోస్టులు పెట్టడం జరిగిందన్నారు. ప్రతి చెక్ పోస్టులో ఆర్టీఏ సిబ్బంది ఉంటారన్నారు. కనుక ప్రతి ఒక్కరు కూడా పశువులను ట్రాన్స్‌పోర్ట్ చేయవద్దని ఆమె ఆ ప్రకటనలో తెలిపారు. బక్రీద్ పండుగ సందర్భంగా ప్రకాశం జిల్లా నందు గోవధ, రవాణా గురించి ఎలాంటి సమాచారము లేదా ఫిర్యాదు చేసేందుకు జిల్లా కలెక్టర్ వారి కార్యాలయం నందు చేసిన కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. సమాచారం అందించే వారు 7093472086, 8096257844 నెంబర్లకు తెలియజేయాలన్నారు.

# నేడు, రేపు ఒంగోలులో ఎంపి మాగుంట పర్యటన



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 15)
ఒంగోలు పార్లమెంటు సభ్యులు, మాగుంట శ్రీనివాసులురెడ్డి ఈ నెల 16, 17వ తేదీలలో ఒంగోలులో పర్యటించనున్నట్లు ఆయన కార్యాలయ వర్గాలు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16వ తేదీ సాయంత్రం 7 గంటలకు టంగుటూరు మండలం, తూర్పు నాయుడుపాలెం గ్రామంలో దామచర్ల సత్య ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో జరుగు విజయోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామితో కలసి పాల్గొంటారన్నారు. రాత్రి 9 గంటలకు ఒంగోలులోని మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. ఈ నెల 17వ తేదీ ఉదయం 8 గంటలకు ఒంగోలులో మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. ఉదయం 11 గంటలకు ఒంగోలులో జరిగే స్థానిక కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. మధ్యాహ్నం 1 గంటకు ఒంగోలులోని మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. సాయంత్రం 8.30 గంటలకు మార్కాపురంలో డాక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి శ్రీహర్ష హాస్పిటల్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డితో కలసి పాల్గొంటారని వారు తెలిపారు.

# జనసేన నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు

రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జూన్ 15)
తన గెలుపుకు సహకరించిన జనసేన నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన జనసేన కార్యాలయానికి విచ్చేసారు. నేను 16 నెలల క్రితమే చెప్పా, ఈ రాష్ట్రంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఒక ప్రజా సునామి రాబోతుందని, 57% ఓట్లతో 160కి పైగా ఎమ్మెల్యే స్థానాలు కూటమి సాధిస్తుందని ముందే చెప్పానన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో సైకిల్ గుర్తుపై ఓటు వేసి జనసేన కార్యకర్తలు తన గెలుపుకోసం కష్టించి పనిచేసారన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో జనసేన అభ్యర్థి పోటీ చేస్తే ఏ విధంగా కష్టం చేస్తారో, ఆ విధంగా తన కోసం కష్టం చేశారని గుర్తు చేశారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ రోడ్ షోకు భారీ మెజారిటీ వచ్చేందుకు ఒక కారణమన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో కోసం కష్టం చేసి, చెమటోడ్చిన జనసేన నాయకులను, కార్యకర్తలను ఎప్పటికి మరచిపోనని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు.

# మంత్రి నారాయణకు శుభాకాంక్షలు తెలిపిన కంచి మల్లిఖార్జునరెడ్డి



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జూన్ 15)
రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ జన్మదిన సందర్భంగా నారా లోకేష్ సేవా సమితి స్టేట్ ఫౌండర్ కంచి మల్లికార్జున రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి పొంగూరు నారాయణ నిండు నూరేళ్లు సుఖ, సంతోషాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు.

# కార్మిక రంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలి




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 15)

### కార్మిక కర్షక పోరాటాల ఫలితంగానే బిజెపి బలం తగ్గింది
### జులై 6,7 తేదీలలో నూజివీడులో జరిగే ఏఐటియుసి వర్క్ షాపు జయప్రదం చేయండి
### 8వ తేదీన విజయవాడలో ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సమావేశాలు
### మీడియా సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ రవీంద్రనాథ్

ప్రతిపక్ష హోదాలో చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్‌లు రాష్ట్రంలోని కార్మిక వర్గానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ కోరారు. ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో ఏఐటియుసి ప్రకాశం జిల్లా సమితి ఆధ్వర్యంలో శనివారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న రవీంద్రనాథ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలు అవలంబించిన బిజెపికి పోరాటాల ద్వారా తగిన గుణపాఠం నేర్పామన్నారు. పూర్తిస్థాయిలో అధికారాన్ని నిలువరించలేకపోయినా బిజెపి బలాన్ని తగ్గించామన్నారు. నాలుగు లేబర్ కోడ్ లు రద్దు చేసే వరకు, మూడు నల్ల వ్యవసాయ చట్టాలు పూర్తిస్థాయిలో ఉపసంహరించుకొనే వరకుకార్మిక, రైతాంగ ఉద్యమాలు ఆగవని హెచ్చరించారు. జగన్ రద్దు చేసిన భావన నిర్మాణ రంగ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరారు. అలాగే భవన నిర్మాణంగా సంక్షేమ బోర్డుకు విరాళంగా రూపాయలు ఇస్తానన్న పవన్ కళ్యాణ్ వెంటనే విరాళం ఇవ్వాలన్నారు. 42 రోజులు అంగన్వాడీల పోరాటం సందర్భంగా మంత్రి లోకేష్ ఇచ్చిన జీతాల పెంపు హామీని వెంటనే అమలు చేయాలన్నారు. స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కనీస వేతనం రూ. 26 వేలు అమలు చేయాలన్నారు. 12 రోజుల మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమ్మె సందర్భంగా టిడిపి నేతలు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చి, వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. జులై 6,7 తేదీలలో ఏఐటియుసి రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌కు ఎంపిక చేయబడిన ప్రతినిధులు హాజరై వర్క్ షాప్ ను జయప్రదం చేయాలని కోరారు. అలాగే 8వ తేదీన విజయవాడలో జరిగే ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సమావేశాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలోకార్మిక, రైతాంగ ఉద్యమాలలో ముందు వరుసలో ఉండి పోరాటాలు చేస్తున్నామన్నారు. తమ పోరాటాల కారణంగానే గుండ్లకమ్మ ప్రాజెక్టు మరమ్మతులకు ప్రభుత్వం నిధులు విడుదల చేయడమే కాకుండా, పనులను వేగవంతంగా చేస్తున్నారని పేర్కొన్నారు.

ఏఐటీయూసీ జిల్లా నాయకులు శ్రీరామ్ శ్రీనివాసులు మాట్లాడుతూ 2019 నుండి పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుల తొలగింపు చర్యలను మానుకోవాలని కోరారు.

పెరిగిన జనాభాకు అనుగుణంగా పారిశుధ్య కార్మికుల సంఖ్య పెంచాలని కోరారు. ఒంగోలులో ఈఎస్ఐ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఎస్.కె రావూఫ్, సిహెచ్ వెంకటేశ్వర్లు, సిపిఐ ఒంగోలు నగర కార్యదర్శి పివిఆర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా నమ్మకాన్ని నిలబెట్టుకుంటా

### రానున్న రెండున్నరేళ్లలో రాజధాని పూర్తికి కృషి చేస్తాం
### అమరావతి రాజధాని చంద్రబాబు కల
### రాష్ట్ర మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ
### హ్యాపీ బర్త్ డే నారాయణ సార్
### టీడీపీ శ్రేణులు, అధికారులు, ప్రజాప్రతినిధులతో కోలాహలంగా మారిన నారాయణ నివాసం
### నారాయణకి బొకేలు, శాలుశాలు, జ్ఞాపికలతో అభినందనల వెల్లువ



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జూన్ 15)
మున్సిపల్ అర్బన్ డెవలప్మెంట్ శాఖ మంత్రిగా ఎన్నికైన డాక్టర్ పొంగూరు నారాయణ పుట్టిన రోజును పురస్కరించుకుని నారాయణ హాస్పిటల్‌లోని మంత్రి నివాసంలో మంత్రి నారాయణను టీడీపీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు, ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. హ్యాపీ బర్త్ డే నారాయణ సార్ అంటూ...పెద్ద ఎత్తున బొకేలు...జ్ఞాపికలు అందచేసి...శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. పెద్ద సంఖ్యలో తరలి రావడంతో... నారాయణ నివాసం కోలాహంగా మారింది. అనంతరం మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ మీడియాతో మాట్లాడారు...ప్రజలు మాపై ఉన్న నమ్మకంతోనే భారీ విజయాన్ని అందించారని...ప్రజా నమ్మకాన్ని నిలబెట్టుకొని సుపరిపాలన అందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నన్ను రాష్ట్ర మున్సిపల్ శాఖామంత్రిగా నియమించారని మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. గతంలో 2014 నుంచి 2019 వరకు మున్సిపల్ శాఖామంత్రిగా పని చేశానని గుర్తు చేశారు. ఆ ఐదేళ్లలో రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో ప్రజల కోసం అనేక సంస్కరణలు తీసుకువచ్చామన్నారు. పేదల నిరుపేదలకి 11 లక్షల ఇళ్లను మంజూరు చేశామన్నారు. అమరావతి రాజధాని కోసం 2015 జనవరి 1వ తేదీ ల్యాండ్ పుల్లింగ్ కోసం నోటిఫికేషన్ ఇచ్చామని...ఫిబ్రవరి 28వ తేదీకి 34వేల ఎకరాలను రైతులు ప్రభుత్వానికి ఇవ్వడం జరిగిందని తెలిపారు. అది మా నాయకుడు చంద్రబాబు నాయుడుపై ఉన్న నమ్మకంతో ఇచ్చారన్నారు. దాదాపు 48వేల కోట్ల రూపాయలతో టెండర్లు పిలవడం జరిగిందని...అందులో కూడా 9వేల కోట్ల రూపాయలు వెచ్చించి, అధికారులకు భవనాలను 90 శాతం పూర్తి చేయడం జరిగిందన్నారు. వీటన్నింటిని గత వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసి...మూడు రాజధానులు అంటూ...మూడు ముక్కల ఆటలాడి...ఈ రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిందని మండిపడ్డారు. రానున్న రెండున్నరేళ్లలో అమరావతి రాజధానిని పూర్తి చేయాలన్నదే నా లక్ష్యమని తెలిపారు. ప్రపంచలోనే టాప్ 5లో...మన రాజధాని ఉండాలన్నదే మన ముఖ్యమంత్రి చందబాబునాయుడు కల అన్నారు. అలాగే టీడీపీ ప్రభుత్వంలో నేను ఒక్క సారిగా మున్సిపల్ ట్యాక్స్ లు పెంచలేదన్నారు. కానీ వైసీపీ ప్రభుత్వం పన్నులు పెంచడమే గాక, చెత్త పన్నుని తీసుకు వచ్చి ప్రజల్ని తీవ్ర ఇబ్బందులకు గురి చేసిందన్నారు. ప్రజలు మాపై నమ్మకంతోనే కూటమి గెలిపించారని...ఆ నమ్మకాన్ని ఖచ్చితంగా నిలబెట్టుకొని... ప్రజలకి సుపరిపాలన అందిస్తామని నారాయణ హామీ ఇచ్చారు.

# బక్రీద్ పండుగను మతసామరస్యంతో ముస్లింలు జరుపుకోవాలి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 15)
త్యాగానికి ప్రతిరూపమైన బక్రీద్ పండుగను మతసామరస్యంతో ముస్లింలు జరుపుకోవాలని సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు మండవ మురళీకృష్ణ తెలిపారు. ప్రకాశం జిల్లా ముస్లిం సోదరులకు ముందుగా బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు .ముస్లిం సంక్షేమ సంఘం ప్రకాశం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం సూర్య శ్రీ దివంగుల చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు మండవ మురళీకృష్ణ గారికి ముస్లిం సంక్షేమ సంఘం తరఫునుంచి వారిని కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. సూర్య శ్రీ ట్రస్ట్ వ్యవస్థాపకులుగా ఉండి ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. అలాగే ముస్లింలకు ఎటువంటి సమస్యలు ఉన్నా నా దగ్గర రండి నేను మీకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమానికి రాష్ట్ర క్రమశిక్షణ అధ్యక్షులు రఫీ అహ్మద్ ప్రకాశం జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ రఫీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సయ్యద్ షహనాజ్, మండవ మురళీకృష్ణకు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి జనసేన నాయకులు షేక్ ఎండి యూనిస్ ముస్లిం సంక్షేమ సంఘం పట్టణ ఉపాధ్యక్షులు షేక్ రెహమాన్, మహిళ పట్టణ అధ్యక్షురాలు షేక్ షాహినా, ముస్లిం మహిళలు పాల్గొన్నారు.



# బొట్లగూడూరు పీహెచ్‌సీలో వైద్యుల నిర్లక్ష్యం

### ఆసుపత్రిలో అసాంఘిక కార్యక్రమాలపై ఆరోపణల వెల్లువ
### ఆసుపత్రిని పరిశీలించిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్ధన్‌రావు





(షణ్ముఖ వెలుగు, పామూరు, జూన్ 15)
ఆసుపత్రిలో అసాంఘిక కార్యక్రమాలపై పామూరు మండలంలోని బొట్లగూడూరు, రేణిమడుగు, మోపాడు అప్ప మాంబాపురం, కంబాలదిన్నె గ్రామస్తులు తన దృష్టికి తీసుకు రావడంపై స్థానిక టీడీపీ నాయకులు, గ్రామస్తులతో కలిసి ఆసుపత్రిని తెలుగుదేశం పార్టీ నాయకులు పరిశీలించారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దన్ రావు ఆసుపత్రికి వచ్చిన డీఎంహెచ్‌వో సురేష్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సృజనలకు ఫిర్యాదు చేశారు. భవిష్యత్తులో తీరు మార్చుకోకుంటే ఎమ్మెల్యే, వైద్యశాఖ మంత్రి, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టిడిపి పామూరు మండల పార్టీ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, ఆదుసుమల్లి ప్రభాకర్ బొట్లగూడూరు సర్పంచి వై బాల, అనపర్తి శశిమహేశ్వరరావు, కోటపాటి నరసింహారావు, కోటపాటి వెంకటేశ్వర్లు, గూడూరి రమేష్, రాయవరపు శ్రీకాంత్, పార వెంకటేశ్వర్లు, కందిమల్ల చెంచు జగన్నాథం, గుర్రాల నాగేశ్వరరావు, కోటపాటి రాజా, ఐటీడీపి కోటపాటి రాము, వెంకటాద్రి, ఎం.పెదమాల్యాద్రి రేగలగడ్డ నాగయ్య, నాగయ్య పాల్గొన్నారు.

# మగ్గం వర్క్‌లో ఉచిత శిక్షణ

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 15)
రూడ్ సెట్ సంస్థలో ఈ నెల 24వ తేదీ నుంచి జర్దోసి మగ్గం వర్క్‌లో ఉచిత శిక్షణ ప్రారంభమతుందని సంస్థ డైరెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ శిక్షణకు ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన గ్రామీణ ప్రాంత నిరుద్యోగ మహిళలు అర్హులుగా పేర్కొన్నారు. అదేవిధంగా 18 -45 సంవత్సరాలు కలిగి ఉండి రేషన్ కార్డు , ఆధార్ కార్డు కలిగి ఉండవలనన్నారు. ఈ శిక్షణలో శిక్షణతో పాటు భోజనం వసతి సౌకర్యాలు ఉచితంగా కల్పించబడునని తెలిపారు. మరిన్ని వివరాలకు 8247387644ను సంప్రదించాలన్నారు.

# బక్రీదు పండుగ సుహృద్భావ వాతావరణంలో జరుపుకోవాలి

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూన్ 14)

జెసి ఆర్ గోపాలకృష్ణ





ఇతరుల మనోభావాలు దెబ్బతినకుంగా సుహృద్భావ వాతావరణంలో బక్రీదు పండుగమ జరుపుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ చెప్పారు. ఈ నెల 17న బక్రీదు పండుగ దృష్ట్యా ముస్లీం, హిందూ మతపెద్దలు, వివిధ శాఖల జిల్లా అధికారులతో శనివారం ప్రకాశం భవనంలోని తన ఛాంబరులో ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. బక్రీదు నేపథ్యం, జంతుపర, జిల్లాలోని పరిస్థితులు, గతంలో జరిగిన సంఘటనలపై సమీక్షించి ఎలాంటి ఉద్రిక్తతలు తలెత్తకుండా తీసు కోవాల్సిన చర్యలపై ఈ సమావేశంలో చర్చించారు. ఏ.ఎస్.పి. నాగేశ్వరరావు మాట్లాడుతూ పటవుల అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా 18 చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని చెప్పారు. పశుసంవరక జాయింట్ డైరెక్టర్ బేబీరాణి మాట్లాడుతూ జంతువధ నిషేదచట్టాలను వివరించారు. డి.టి.సి. ఆర్ సుశీల మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా పశువుల రవాణా జరుగకుండా నిఘా మరింత పెంచుతా మన్నారు. డి.పి ఉషారాణి మాట్లాడుతూ ముస్లీం ప్రార్ధనా మందిరాల వద్ద పారిశుధ్య పనులు చేపట్టాలని ఇప్పటికే గ్రామస్థాయి సిబ్బందిని ఆదేశించామన్నారు. ఆది, సోమ వారాలు పంచాయతీ సెక్రటరీలు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండేలా ఆదేశాలు జారీ చేశామన్నారు. హిందూ, ముస్లిం మతపెద్దలు మాట్లాడుతూ ఇతరుల మనోభావాలు దెబ్బతినకుండా ఆధ్యాత్మిక భావంతో ప్రతి ఒక్కరూ నిబంధనలకు లోబడి తమ సంప్రదాయ ఆచాగాలను పాటిస్తే సమస్యలు తలెత్తవని అభిప్రాయపడ్డారు. అనంతరం జాయింట్ కరెక్టర్ మాట్లాడుతూ పశువుల అక్రమ రవాణా, ఓవర్ లోడింగ్ కట్టడికి జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. జిల్లాలో ఏర్పాటు చేస్తున్న 16 టెక్. పోస్టులలో రవాణా, పశుసంవర్ధక, పోలీసు, రెవెన్యూ శాఖల నుంచి ఒక ఉద్యోగి ఉండేలా ఆదేశాలు జారీ చేస్తున్నామన్నారు. గతంలో ఘర్షణలకు దారితీసిన ప్రాంతాల (బ్లాక్ స్పాట్స్)పై ఈసారి మరింత దృష్టి సారిస్తున్నామన్నారు. ఆయా ప్రాంతాలతోపాటు మండలం మొత్తం పారిశుధ్య పరంగా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఈ.ఓ.పి.ఆర్.డి.ని ఆదేశించామన్నారు. వెటర్నరీ డాక్టర్లు అందరూ ఆది, సోమవారాలలో కచ్చితంగా ఆయా మండల కేంద్రాలలో అందుబాబులో ఉండేలా ఆదేశాలు జారీ చేస్తున్నామన్నారు. మాంసాహారం తినడం, ఇతర ఏదైనా కారణాలతో తయేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నామని, ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేలా సబ్ సెంటర్లు, పి.హెచ్.సి.లలో అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని వైద్యాధికారులను ఆదేశించాడు. చెక్ పోస్టుల వద్ద అక్రమంగా తరలిస్తున్న పశువులను గుర్తిస్తే బక్రీదు ముగిసే వరకు వాటిని సంరక్షించేలా తాత్కాలిక షెల్టర్లు ఏర్పాటు చేసే విషయంలో ప్రభుత్వ అధికారులకు స్థానిక ప్రజలు, మత పెద్దలు సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లాలో తొలుక మున్సిపాలిటీలలో శాశ్వత ప్రాతిపధికన కబేళాలు, చేపల మార్కెట్ల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వానికి పంపేలా ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను ఆయన ఆదేశించారు.

**ప్రత్యేక కంట్రోల్ సెంటర్**

బక్రీదు సందర్భంగా ఆశ్రమంగా పశువుల రవాణా. అంతుపధను గుర్తించినా, వైద్య, పోలీసు సహాయం అవసరమైనా, పారిశుధ్య పనులలో లోపాలు గుర్తించితా వేరుగా జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని ప్రజలకు, మత పెద్దలకు జాయింట్ కలెక్టర్ సూచించారు. ఇందుకోసం 24 గంటలూ పనిచేసేలా ప్రత్యేకంగా కలెక్టరేట్ 7093472086, 8096257544 నెంబర్లతో కంట్రోల్ రూమును ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు, పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, పశుసంవర్ధక, వైద్య శాఖల అధికారులు ఈ కేంద్రంలో అందుబాటులో ఉంటారని జాయింట్ కలెక్టర్ చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి వి.నారాయణ, ఒంగోలు, కనిగిరి ఆర్.డి.ఓలు బి.వి.సుబ్బారెడ్డి, జాన్ ఇర్విన్, ఒంగోలు డి.ఎస్.పి. కిషోర్ బాబు, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ జస్వంత్రావు, మర్కాపురం, కనిగిరి, దర్శి మున్సిపల్ అధికారులు, వైద్య శాఖ డి.పి.ఎస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# అంత్యక్రియలకు ఆర్థిక సాయం



(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 15)

పొదిలి నగర పంచాయితీలోని మల్కిపురంలో స్వర్గస్తులైన షేక్ నాగుర్ (45) భౌతిక కాయాన్ని స్మశానానికి తరలించడానికి మానవత సంస్థ తరపున శాంతి రథంను, అంత్యక్రియలకు వారి భార్యకు రూ.5000 ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో మానవత సంస్థ డైరెక్టర్ కాటూరి నారాయణ బాబు (పెదబాబు), కన్వీనర్ కే యల్లమందారెడ్డి, ఉపాధ్యక్షుడు అశోక్ బండి, సభ్యులు అరిక రాము, రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి నారాయణకు శుభాకాంక్షలు తెలిపిన కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి





(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జూన్ 15)

రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయనకు తెలుగుదేశం పార్టీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నారాయణ దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు కోడూరు కమలాకర్ రెడ్డి, దాట్ల చక్రవర్ధన్ రెడ్డి,నూకరాజు మదన్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కలెక్షన్ సెంటర్‌ను ఉద్యాన ఉత్పత్తులకే వాడాలి

## ఉద్యాన అధికారి పి లక్ష్మి



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జూన్ 15)

జూన్ 15 పెనుశిల లక్ష్మీనరసింహ ఉద్యాన రైతు సంఘం ఏటూరు ఎన్ని కంద్రిక రైతు సభ్యులకు శనివారం ఉదయం 11 గంటలకు ఉద్యాన అధికారి పి.లక్ష్మి కలెక్షన్ సెంటర్ ఉపయోగం గురించి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్షన్ సెంటర్‌ను ఉద్యాన రైతు సంఘ సభ్యులు వారు పండించిన ఉద్యాన ఉత్పత్తులను గ్రేడింగ్ , ప్యాకింగ్‌లకు మాత్రమే ఉపయోగించాలన్నారు. మిగతా ఎటువంటి కార్యక్రమ మునకు గాని ఉపయోగించకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు ఉత్పత్తిదారుల సంఘం వైస్ ప్రెసిడెంట్ టి ఆదిశేషరెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు పి సూర్యనారాయణ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# షాపు ముందు ఆటో తీయమన్నందుకు కత్తితో దాడి వ్యక్తికి గాయాలు







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 15)

నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ లోపలికి వెళ్లే ద్వారం వద్ద ఉన్న మొబైల్ షాప్ ఎదురుగా ఆటో నిలిపినారని, యజమాని ఆటో షాపు ముందు తీయమనీ అన్నందుకు ఆటో డ్రైవర్ దాడి చేసిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే ఆటో డ్రైవర్, షాపు సిబ్బంది మధ్య ఘర్షణ జరిగింది. ఇరుపక్షాలను కొందరు తప్పించగా మరలా కొబ్బరి బోండాలు కొట్టే కత్తితో ఇరువురు దాడి చేసుకున్నారు. పట్టణ నడిబొడ్డిలో కత్తులతో దాడి చేసుకోవడం చూసిన ప్రజలు భయాందోళనకు గురై పరుగులు తీశారు. కత్తి గాయమైన వ్యక్తిని ఒంగోలు రిమ్స్ కు తరలించారు. ఒకటో పట్టణ పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకొని విచారించి అవుట్ పోస్టింగ్ సిబ్బందికి క్షతగాత్రుల వివరాలు తీసుకుని, వెంటనే ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు అందించాలని సూచించారు. ఏది ఏమైనా పట్టణ నడిబొడ్డు ప్రాంతంలో ఇలాంటి ఘర్షణలు జరగటం శాంతిభద్రతలకు విఘాతం కలిగినట్లుగానే ఉంటుందని ప్రజలు వాపోతున్నారు. ఇటువంటి సంఘటనలతో ప్రజానీకం భయభ్రాంతులకు గురవుతుంటే ఆ ప్రాంతంలో ట్రాఫిక్ పోలీసు కూడా లేకపోవడం శోచనీయంగా ఉందని విమర్శలు వినిపిస్తున్నాయి.

# శ్రీగిరి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

## బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 15)

ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి 28వ వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆలయ నిర్వాహకులు శనివారం సాయంత్రం శ్రీకారం చుట్టారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయ అర్చకులు, వేద పండితులు శ్రీవారికి సహస్ర నామార్చన నిర్వహించారు. తిరుమలకు చెందిన పరాంకుశం సీతారామాచార్యులు బృందం ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ కావించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనము, మేదినీ పూజ , మృత్సంగ్రహణం, వాస్తు హోమం, ధ్వజ దండ, ధ్వజ పట గరుడ ప్రతిష్ఠ తీర్మానము కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు జ్వాలా రామారావు, కార్య నిర్వహణ ధర్మకర్త సి వి రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వర రావు, ఆలూరు లక్ష్మీ కుమారి పర్యవేక్షించారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసారు. కలియుగ ప్రత్యక్ష దైవం.. బ్రహ్మాండ నాయకుడైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించి భక్తులు తన్మయత్వంతో గోవింద నామ స్మరణ చేసారు. శ్రీ మహావిష్ణు సహస్ర నామ పారయణలో పలువురు మహిళా భక్తులు పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

**16వ తేదీ కార్యక్రమాల వివరాలు:**

శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండో రోజయిన ఆదివారం ఉదయం రక్షా బంధనం, భేరీపూజ, ధ్వజారోహణం, విశేష స్నపన తిరుమంజనం, సాయంత్రం కుంభ పూజ, బలి హోమంతోపాటు శ్రీవారికి శేష వాహన సేవ సందర్భంగా రంద శరణ్య కూచిపూడి డ్యాన్స్ అకాడమీ హైదారాబాద్ వారిచే కూచిపూడి నృత్య ప్రదర్శన జరుగుతాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని ఆలయ నిర్వాహకులు కోరారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా నిర్వహించే శ్రీవారి ఆర్జిత సేవల్లో పాల్గొన దలచిన భక్తులు శ్రీగిరి దేవస్థానం కార్యాలయంలో సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలని ఆలయ నిర్వాహకులు సూచించారు.

# మంత్రి నారాయణకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన వీపీఆర్ దంపతులు

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జూన్ 15)

నెల్లూరులోని రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ నివాసానికి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు విచ్చేశారు. మంత్రి నారాయణ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు వీపీఆర్ దంపతులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కుటుంబసభ్యులు కాసేపు చర్చించుకున్నారు. వీపీఆర్ దంపతుల వెంట డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, జిల్లా టీడీపీ అధికారి వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, నగర అధ్యక్షుడు మామిడాల మధు, ఇతర ముఖ్యనేతలు ఉన్నారు.





# అత్యుత్తమ రాజధానిగా అమరావతిని నిర్మిస్తాం



### రాజధాని అభివృద్ధికి పక్కా ప్రణాళిక
### రెండున్నరేళ్లలో పూర్తిస్థాయిలో నిర్మాణం
### రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు
### రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణ

**(షణ్ముఖ వెలుగు బ్యూరో, నెల్లూరు, జూన్ 15)**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా అమరావతిని అద్భుతంగా అభివృద్ధి చేసి ఐదు అత్యుత్తమ రాజధానుల సరసన నిలిపేందుకు పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. శనివారం నెల్లూరు రూరల్ మండలం చింతారెడ్డిపాలెంలోని నారాయణ మెడికల్ కళాశాల ఆవరణలోని తన స్వగృహంలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ 2015 జనవరిలో అమరావతి రాజధాని నిర్మాణానికి కేవలం 58 రోజుల్లో 34వేల ఎకరాల భూములను రైతులు అందజేశారని, కేవలం ముఖ్యమంత్రి చంద్రబాబుపై నమ్మకంతోనే తమ భూములను రాజధాని ఏర్పాటుకు కేటాయించారని మంత్రి గుర్తుచేశారు. ఇది ఒక రికార్డు అని, ఈ విషయాన్ని ప్రముఖ హార్వర్డ్ యూనివర్శిటీ ఒక కేసు స్టడీగా తీసుకుని తమతో ప్రత్యేకంగా మాట్లాడినట్లు చెప్పారు. 48వేల కోట్ల రూపాయలతో రాజధాని ప్రాంతంలో అభివృద్ధి పనులకు టెండర్లు కూడా పిలవగా, 9వేల కోట్లతో ప్రభుత్వ కార్యాలయ భవన నిర్మాణాలు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మొదల్కెన మౌలిక వసతులు కల్పించామని చెప్పారు. అనేక భవన నిర్మాణాలు వివిధ దశల్లోనే నిలిచిపోయాయని, వీటిని పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు స్పష్టం చేశారు. అధికారులతో చర్చించి ఒక కార్యాచరణ రూపొందించుకుని సుమారు రెండున్నరేళ్లలోనే అమరావతి రాజధాని నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు కృషి చేస్తామని మంత్రి నారాయణ పేర్కొన్నారు. 2014లో తాను మున్సిపల్, పట్టణ అభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్న సమయంలో రాజధాని నిర్మాణానికి వేగంగా పనులు చేపట్టామని, అదే స్ఫూర్తితో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తనపై మరోసారి రాజధానిని అభివృద్ధి చేసే బాధ్యతను తనపై ఉంచారని, ఆయన నమ్మకాన్ని నిలబెట్టేందుకు రాజధాని అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తానని ఈ సందర్భంగా మంత్రి నారాయణ పేర్కొన్నారు.

**మున్సిపాలిటీల అభివృద్ధికి పెద్దపీట**

2014 నుంచి 2019 వరకు తమ పరిపాలనలో అనేక సంస్కరణలు తీసుకొచ్చి రాష్ట్రంలోని 114 మున్సిపాల్టీలలో పెద్దఎత్తున పార్కులు, రోడ్లు, డ్రైనేజీలు, డివైడర్లు, పాఠశాలల్లో మౌలికవసతులు మొదల్కెన అభివృద్ధి పనులు చేపట్టామని మంత్రి నారాయణ చెప్పారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన క్షణాల్లోనే ప్లాన్ అప్రూవల్ ఇచ్చేలా చర్యలు చేపట్టామన్నారు. ఎటువంటి ఛార్జీలు కూడా ప్రజల నుంచి వసూలు చేయలేదన్నారు.

గత ప్రభుత్వం ప్రజలపై పన్నుల భారం మోపిందని, చెత్తపన్నుతో ప్రజలు బాగా ఇబ్బందులు పడ్డారని మంత్రి చెప్పారు. అధికారులతో సమీక్షించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. అలాగే నిరుపేదల సొంతింటి కలను సహకారం చేసేందుకు అత్యాధునికి టెక్నాలజీతో 11లక్షల టిడ్కో ఇళ్లను నిర్మించామని, వీటిని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, త్వరలోనే అన్ని సౌకర్యాలతో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు కూడా ప్రత్యేక దృష్టి సారిస్తామని మంత్రి చెప్పారు. అధికారులతో త్వరలోనే సమావేశమై మున్సిపాలిటీల పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, పెండింగ్‌లో పనులపై చర్చించి మున్సిపాలిటీలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

## కందులను కలిసిన మాజీ ఫుడ్ కమిషన్ మెంబర్ డాక్టర్ స్వర్ణ గీత





**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 15)**

మార్కాపురం ఎమ్మెల్యేగా ఎన్నికైన కందులు నారాయణరెడ్డిని పొదిలికి చెందిన రాష్ట్ర మాజీ ఫుడ్ కమిషన్ మెంబర్ డాక్టర్ స్వర్ణ గీత శనివారం ఆయన నివాకంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల బొకే అందజేసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె పలు విషయాలు చర్చించారు.

## కందులకు ఆయన చిత్రపటం బహూకరణ



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 15)**

పొదిలి పట్టణానికి చెందిన ప్రముఖ కళాకారుడు పచ్చవ సుబ్బారావు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి చిత్రపటాన్ని తన స్వహస్తాలతో గీశాడు. గీసిన ఆ చిత్రపటాన్ని మార్కాపురం పట్టణంలోని ఆయన నివాసంలో శనివారం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి బహుమతిగా అందజేసి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రామాపురం ఓబయ్య, మైనార్టీ నాయకులు ముల్లా బుచ్చిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## కందులకి శుభాకాంక్షలు తెలిపిన కమిషనర్





**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 15)**

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని పొదిలి నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి పూల బొకే అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డితో ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ పొదిలి నగర పంచాయతీలో ప్రజలకు ఏ సమస్య వచ్చిన ముందుంటున్నారని వెంటనే సమస్య పరిష్కరిస్తున్నారని ఇలాగే ప్రజలకు సేవలు అందించాలన్నారు. ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ మారుతీరావు, నగర పంచాయతీ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, నగర పంచాయతీ ఏఈ భూపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అల్లా దయతో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలి

### బారాషాహిద్ దర్గాలో పొంగూరు రమాదేవి ప్రత్యేక ప్రార్థనలు



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జూన్ 15)**

రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ నేడు జన్మదిన సందర్భంగా నెల్లూరులోని పవిత్ర బారాషాహిద్ దర్గాలో 42వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ముస్లిం మైనార్టీ నాయకులు మొహిద్దిన్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ,సతీమణి పొంగూరు రమాదేవి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నారాయణ అత్యధిక మెజార్టీతో గెలుపొందాలని తాను దర్గాలో మొక్కుకోవడం కోరడం జరిగిందన్నారు. గతంలో నారాయణ మంత్రిగా బారాషాద్ దర్గాను ఎంతో అభివృద్ధి చేశారని, ఈ ప్రాంతంలో అన్ని వసతులు ఏర్పాటు చేసి రొట్టెల పండుగను రాష్ట్ర పండుగగా తీర్చిదిద్దారన్నారు. ఆ అల్లా దయవల్ల నగర ప్రజలు ముఖ్యంగా ముస్లిం మైనార్టీల సహాయ, సహకారాలతో నేడు ఇంతటి భారీ మెజార్టీతో నారాయణ గెలుపొందారన్నారు. ఈ సందర్భంగా దర్గాకు విచ్చేసి తన మొక్కును తీర్చుకోవడం జరిగిందన్నారు. నారాయణ తిరిగి మున్సిపల్ శాఖ మంత్రి బాధ్యతలు చేపట్టారని మన బారాషాహిద్ దర్గాను మరింత అభివృద్ధి చేస్తారని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ ముస్లిం మైనార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అతి త్వరలోనే అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తాం

### రూ. 5లకే నిరుపేదలకి మంచి భోజనం అందిస్తాం

### రాష్ట్ర మున్సిపల్ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జూన్ 15)**

నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 38వ డివిజన్, ఏ.సి. కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న అన్న కాంటీన్‌ను రాష్ట్ర మునిసిపల్ శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, నగర మాజీ మేయర్ భానుశ్రీ పరిశీలించారు. 2014 నుంచి 2019 వరకు తెలుగుదేశం ప్రభుత్వంలో రోజుకి 2 లక్షల 25వేల మందికి రూ.5లకే చక్కటి భోజనం తినే విధంగా అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసామన్నారు. నిరుపేదలందరికీ మంచి ఆహారం అందించాలని ఇస్కాన్ సిటీ చారిటబుల్ ట్రస్ట్ వారికి అప్పగించామన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాన్ని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం సర్వ నాశనం చేసి మూసి వేసిందని మంత్రి పొంగూరు నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయిన వెంటనే అన్న క్యాంటీన్ల పునః ప్రారంభించాలని సంతకం చేసారని, త్వరలోనే అన్న క్యాంటీన్లను పునః ప్రారంభిస్తామని, పేద నిరుపేదలందరికి మంచి భోజనం అందిస్తామని టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పేర్కొన్నారు. ఎక్కడైతే నిరుపేదలు, కూలీలు అధిక సంఖ్యలో ఉంటారో అక్కడే ప్రధానంగా అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసి, నాణ్యతా ప్రమాణాలతో భోజనాన్ని అందిస్తామని నగర మాజీ మేయర్ భానుశ్రీ తెలిపారు.

## కందులూరులో నాయకులు, అభిమానుల సమక్షంలో ఘనంగా మన్నం వెంకన్న జన్మదిన వేడుకలు









**(షణ్ముఖ వెలుగు, టంగుటూరు, జూన్ 15)**

ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం కందులూరు గ్రామం నివాసి అయిన మన్నం వెంకన్న జన్మదిన వేడుకలు కందులూరు గ్రామములో కనివిని ఎరుగని రీతిలో అభిమానులు, ప్రజలు, బడుగు బలహీన ప్రజల సమక్షంలో వెంకన్న జన్మదిన వేడుకలు విజయవంతంగా నిర్వహించారు. కందులూరు గ్రామ ప్రజానీకంతో పాటు యావత్తు ప్రజానీకం మన్నం వెంకన్న పట్ల ప్రత్యేకంగా హర్షం వ్యక్తం చేస్తున్నారు . ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల ప్రజలు ఆయన నివాసం వద్దకు వచ్చి వెంకన్నని శాలువాలతో సత్కరించి పూలతో స్వాగతం పలికారు. వెంకన్న జన్మదిన వేడుకలు విజయవంతముగా ప్రజల సమక్షంలో వెంకన్న జన్మదిన వేడుకలు జరుపుకోవడం ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. మన్నం వెంకన్న ఆయన జన్మదిన వేడుకలు స్వగ్రామమైన కందులూరు గ్రామములో తన నివాస ప్రాంగణంలో శనివారం ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించుకోవడం కందులూరు గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఇలాంటి పుట్టినరోజు కార్యక్రమాలు మరెన్నో జరుపుకోవాలని ఆయన్ని ప్రజలు కార్యకర్తలు నాయకులు అభిమానులు ప్రభుత్వ ఉద్యోగస్తులు వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ అధికారులు వెంకన్న నివాస గృహం వద్దకు వచ్చి జన్మదిన వేడుకలు ఆయనతో షేర్ చేసుకొని కార్యక్రమం విజయవంతం చేశారు . కార్యక్రమంలో బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వరికూటి అశోక్ బాబు కుటుంబ సభ్యులు మన్నం వెంకన్నకి ప్రత్యేకంగా వారు శుభాకాంక్షలు తెలపడం ఎంతో ఆనందంగా ఉందని మన్నం వెంకన్న ప్రజల సమక్షంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈనాటి కలం ఎడిటర్ , హైకోర్టు లాయర్ మన్నం సుధీర్ కుమార్ , ఐసిడిఎస్ రాష్ట్ర లీగల్ అడ్వైజర్ మన్నం సుధాకర్ బాబు, టంగుటూరు మండల జెసిఎస్ కన్వీనర్ చింతపల్లి హరిబాబు, ఈనాటి కలం బుజ్జి అన్న, వికలాంగు నాయకులు కాలేశా, వసుమర్తి రాజేషు, కసుకుర్తి నవీన్, మొలకలపల్లి సీతారామయ్య, కొమ్ము సురేంద్ర, పాటిబండ్ల కమలాకర్, మలిశెట్టి శ్రీనివాసరెడ్డి ,బత్తుల అనిల్ ,కటకం శెట్టి కృష్ణ, రణదీప్ కోటి బాబు, జ్యూస్ సురేంద్ర, పైనం మధుబాబు, గోలిమి కోటేశ్వరరావు ,మెకానిక్ మల్లికార్జున్ ,గోగుల వెంకట్రావు ,దార్ల వెంకటేశ్వర్లు ,ప్రసన్న వహీదా,, డీలు బుడ్డ అమ్మాయి ,తదితరులు మనం వెంకన్న జన్మదిన వేడుకల్లో పాల్గొనడం ఎంతో శుభసూచకమని వారి కుటుంబ సభ్యులు బంధుమిత్రులు శ్రేయోభిలాషులు ప్రత్యేకంగా ఈ కార్యక్రమానికి వచ్చిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా శుభాకాంక్షలు తెలిపారు.

# ఆట ఆగస్టులో

సినిమాల విడుదలకు ప్రత్యేకమైన రోజుల్నే ఎక్కువగా ఎంచుకుంటారు దర్శకనిర్మాతలు. ఆ రోజు కోసం పలు చిత్రాలు విడుదల కోసం పోటీ పడుతుంటాయి. అందులో ఏ ఒక్కటి తప్పుకున్నా..ఆ స్థానాన్ని మరో సినిమా భర్తీ చేస్తుంది. ఇప్పుడీ తరహాలోనే బాలీవుడ్ చిత్రం 'ఖేల్ ఖేల్ మే' రానుంది. అక్షయ్ కుమార్, తాప్సి, వాణీ కపూర్ తదితరులు నటించిన కామెడీ ఎంటర్‌టైనర్ ఇది. ముదస్సర్ అజీజ్ తెరకెక్కిస్తున్నారు. సెప్టెంబరు 6న విడుదలకు సిద్ధమైన ఈ చిత్రం ఒక నెల ముందుగానే, అంటే ఆగస్టు 15న రానున్నట్లు ప్రకటించారు. ఈ





విషయాన్ని సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకుంది తాప్సి. 'ఆగస్టు 15న నవ్వులు పూయిస్తూ..వినోదాన్ని పంచే మ్యాడ్ ప్రపంచంలోకి అడుగుపెట్టేందుకు సిద్ధంగా ఉండండి. 'ఖేల్ ఖేల్ మే' వచ్చేది ఆరోజే. క్యాలెండర్‌లో మార్క్ చేసుకోండి' అంటూ వ్యాఖ్యల్ని జోడించిందీమె. ప్రస్తుతం 'వో లడ్కీ హే కహా?', 'ఫిర్ ఆయీ హసీన్ దిల్‌రుబా' లాంటి చిత్రాలతో బిజీగా ఉంది తాప్సి.

# భాగ్యనగరంలో డెకాయిట్ యాక్షన్






అడివి శేష్, శ్రుతిహాసన్ జంటగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం "డెకాయిట్". షానీల్ డియో తెరకెక్కిస్తున్న ఈ సినిమాని సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తున్నారు. సునీల్ నారంగ్ సహ నిర్మాత. ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది. తాజాగా ఈ చిత్ర సెట్‌లోకి శ్రుతి అడుగు పెట్టింది. ఈ విషయాన్ని శ్రుతితో పాటు చిత్ర బృందం సామాజిక మాధ్యమాల వేదికగా వెల్లడించింది. ఈ షెడ్యూల్‌లో భాగంగా శేష్, శ్రుతిలపై భారీ యాక్షన్ సీక్వెన్స్‌తో పాటు కీలక సన్నివేశాలు చిత్రీకరించనున్నారు. "ఇది ఇద్దరు మాజీ ప్రేమికుల కథగా ఉంటుంది. వాళ్లు తమ జీవితాలను మార్చుకోవడానికి వరుస దోపిడీల కోసం మళ్లీ చేతులు కలపాల్సి వస్తుంది. మరి ఆ ప్రయాణం ఎలా సాగింది.. ఎదురైన సవాళ్లేంటన్నది ఆసక్తికరం" అని చిత్ర వర్గాలు తెలిపాయి. అడివి శేష్ దీనికి స్వయంగా కథ, స్క్రీన్‌ప్లే అందించారు.

# ధైర్యం వచ్చేది అప్పుడే.. అలియా భట్



తమ్ముడు కోసం అక్క చేసే పోరాట కథనంతో తెరకెక్కుతున్న థ్రిల్లర్ చిత్రం 'జిగ్రా'. ప్రముఖ బాలీవుడ్ కథానాయిక అలియా భట్ ప్రధాన పాత్రలో అలరించనుంది. వేదాంగ్ రైనా కీలక పాత్ర పోషిస్తున్నాడు. మహిళా ప్రాధాన్య కథతో రూపొందుతున్న ఈ చిత్రానికి వాసన్ బాలా దర్శకత్వం వహిస్తున్నారు. కరణ్ జోహార్ నిర్మాత. మొదట ఈ చిత్రాన్ని సెప్టెంబరు 27న విడుదల చేస్తున్నట్లు ప్రకటించిన చిత్రబృందం ఇప్పుడు కొత్త తేదీని ఖరారు చేసింది. ఈ సినిమా అక్టోబరు 11న ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు సామాజిక మాధ్యమాల వేదికగా వెల్లడిస్తూ పోస్టర్‌ని పంచుకుంది. 'మనకు దగ్గరైన వాళ్లు ప్రమాదంలో ఉన్నప్పుడే వాళ్లని కాపాడేందుకు ధైర్యం వస్తుంది' అంటూ వ్యాఖ్యల్ని జోడించింది. ఆసక్తికరమైన మలుపులతో ఈ 'జిగ్రా' ప్రయాణం ఉండనుందని, థ్రిల్లింగ్ అనుభూతిని పొందేందుకు సిద్ధంగా ఉండమని చిత్రవర్గాలు తెలిపాయి.

# లేడీ బాస్.. నీరా వాసుదేవ్



నితిన్ హీరోగా వెంకీ కుడుముల తెరకెక్కిస్తున్న చిత్రం 'రాబిన్‌హుడ్'. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. శ్రీలీల కథానాయిక. శుక్రవారం ఆమె పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా నుంచి తన ఫస్ట్‌లుక్, గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఆ ప్రచార చిత్రంలో శ్రీలీల స్టైలిష్ లుక్‌లో తన ప్రైవేట్ జెట్ నుంచి కిందకి దిగడం కనిపించింది. "జ్యోతీ.. సునామీలో టి సైలెంట్‌గా ఉండాలి. నా ముందు నువ్వు సైలెంట్‌గా ఉండాలి" అంటూ ఆ వీడియోలో శ్రీలీల చెప్పిన డైలాగ్ అలరించింది. ఈ చిత్రంలో ఆమె లేడీ బాస్ నీరా వాసుదేవ్ అనే పాత్రలో కనిపించనున్నట్లు చిత్ర బృందం తెలియజేసింది. చిత్రీకరణ దశలో ఉన్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ డిసెంబరు 20న థియేటర్లలోకి రానుంది. ఈ సినిమాకి సంగీతం: జీవీ ప్రకాశ్ కుమార్, ఛాయాగ్రహణం: సాయి శ్రీరామ్.

# నా సగం జీవితం నటిగానే గడిపా: కృతి కర్బందా



తెలుగు చిత్రం 'బోణి'తో సినీరంగంలో అడుగుపెట్టింది కథానాయిక కృతి కర్బందా. చిత్రసీమలో రాణిస్తూ..తాజాగా 15ఏళ్లను విజయవంతంగా పూర్తిచేసుకుందీమె. ఈ నేపథ్యంలో సామాజిక మాధ్యమాల వేదికగా తనకు ప్రేమను పంచిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపింది. 'ఇన్నేళ్లలో నా సగం జీవితం నటిగానే గడిపాను. నటనపై నాలో నాకే తెలియని ఓ అభిరుచి ఏర్పడింది. ఈ మధ్యలో ఎన్నో మరపురాని అనుభావాల్ని సంపాదించుకున్నా. కన్నడలో నేను చేసిన 'గూగ్లీ' విడుదలైన సమయమది. అందులో నేను డాక్టర్ స్వాతిగా కనిపిస్తా. ఒకరోజు షాపింగ్ కోసం మాల్‌కి వెళ్లాము. అక్కడున్న వాళ్లంతా నన్ను గుర్తుపట్టి 'డాక్టర్ డాక్టర్' అని పిలవడం మొదలుపెట్టారు. అస్సలు నమ్మలేకపోయాను. ఊహించలేదు కూడా. ఆనందంతో పొంగిపోయా. అప్పుడు పరిశ్రమలో నాకున్న క్రేజ్ ఏమిటో అర్థమైంది' అని ఒక జ్ఞాపకాన్ని గుర్తుచేసుకుంది. 'ఈ అద్భుతమైన ప్రయాణంలో భాగమైన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. నా కుటుంబం, నా భర్త, స్నేహితులు..అన్నింటికంటే నా ప్రతిభను గుర్తించి, నమ్మకంతో నాకు అవకాశం కల్పించిన దర్శకనిర్మాతలు, నాపై ప్రేమను కురిపిస్తున్న అభిమానులకు థాంక్యూ' అంటూ రాసుకొచ్చింది కృతి. ఇటీవలే వివాహ బంధంలోకి అడుగుపెట్టిన ఈమె 'రిస్కీ రోమియో'తో త్వరలో సందడి చేయనుంది.

# రివ్యూ: యక్షిణి..

వేదిక, రాహుల్ విజయ్, మంచు లక్ష్మీ, అజయ్ కీలక పాత్రల్లో నటించిన 'యక్షిణి' వెబ్‌సిరీస్ ఎలా ఉందంటే?

యక్షిణ్మి నటీనటులు: రాహుల్ విజయ్, వేదిక, మంచు లక్ష్మి, అజయ్, శ్రీనివాస్, తేజ కాకుమాను, దయానందరెడ్డి, ప్రవీణ్, జెమినీ సురేశ్ తదితరుల్మ్మ సంగీతం: ప్రియదర్శన్ బాలసుబ్రహ్మణ్యమ్మ సినిమాటోగ్రఫీ: జగదీశ్ చీకట్మ్మి ఎడిటింగ్: కార్తికేయన్ రోహిణ్మి నిర్మాత: శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేన్మి వీఎఫ్ఎక్స్: జునైద్ ఉల్లఫ్మ్మ దర్శకత్వం: తేజ మర్న్మి స్ట్రీమింగ్ వేదిక: డిస్నీహాట్‌స్టార్

సినిమాలకు దీటుగా ప్రేక్షకులను అలరిస్తున్నాయి వెబ్‌సిరీస్‌లు. అందుకు తగినట్లే అత్యాధునిక హంగులతో సరికొత్త జానర్స్‌లో సిరీస్‌లను తీసుకొస్తున్నారు దర్శక-నిర్మాతలు. అలా డిస్నీహాట్‌స్టార్‌లో వచ్చిన వెబ్‌సిరీస్ 'యక్షిణి'. తాజాగా స్ట్రీమింగ్‌కు వచ్చిన ఈ సిరీస్ ఎలా ఉంది? పురాణాల్లో మాత్రమే కనిపించే 'యక్షిణి' పాత్రను ఎలా ఆవిష్కరించారు?

కథేంటంటే: మాయ (వేదిక) ఒక యక్షిణి. శాపం కారణంగా భూమిపై ఉండాల్సి వస్తుంది. తమో రజో గుణంతో వందమంది పురుషులను అనుభవించి, వారిని హతమార్చిన తర్వాతే ఆమెకు శాపవిమోచనం కలుగుతుంది. 99 మందిని అలాగే హత్య చేస్తుంది. అయితే, 100వ వ్యక్తి మాత్రం నిష్ఠ కలిగిన బ్రహ్మచారి అయి ఉండాలన్నది షరతు. అలాంటి వ్యక్తి కోసం వెతుకుతున్న తరుణంలో కృష్ణ (రాహుల్ విజయ్) పరిచయం అవుతాడు. హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో మేనేజర్‌గా పనిచేస్తూ ఉంటాడు. మరోవైపు క్షుద్ర, తాంత్రిక విద్యలతో యక్షిణిని వశం చేసుకోవాలని ఎదురు చూస్తుంటాడు మహాకాల్ (అజయ్). మరి యక్షిణితో పరిచయం అయిన తర్వాత కృష్ణ జీవితం ఎలాంటి మలుపులు తిరిగింది? (%ఖబిదిరీనీరిదీరి జీలిఖీరిలిగీ రిదీ శిలిజితివీతి%) ఈ క్రమంలో అతడికి ఎదురైన పరిస్థితులు ఏంటి? మహాకాల్ ఎందుకు యక్షిణిని వశం చేసుకోవాలని చూస్తున్నాడు? ఇవన్నీ తెలియాలంటే సిరీస్ చూడాల్సిందే!



**ఎలా ఉందంటే:** పురాణాల్లో పాత్రల ఇతివృత్తంగా సినిమాలను తెరకెక్కించడం తెలుగు తెరకు కొత్తేమీ కాదు. మారిన పరిస్థితులకు వాటిని అన్వయించుకుంటూ రూపొందిస్తే ప్రేక్షకులు ఆదరిస్తారనేందుకు 'బింబిసార'లాంటి అనేక ఉదాహరణలు ఉన్నాయి. అయితే, కథ చెప్పే విషయంలో ఎంత కన్విన్సింగ్‌గా చెప్పామన్న దానిని బట్టే విజయం ఆధారపడి ఉంటుంది. 'యక్షిణి' అనే చందమామ కథను ఆసక్తికరంగా తీర్చిదిద్దడంలో దర్శకుడు తేజ మర్ని మంచి ప్రయత్నం చేశారు. ఇక్కడ కథ మూడు కోణాల్లో నడుస్తుంది. 1. బ్రహ్మచర్యం నిష్ఠగా పాటించే వ్యక్తిని అనుభవించి చంపడం ద్వారా తన శాపాన్ని విమోచన చేసుకోవాలనుకునే యక్షిణి మాయ.. 2. భూమ్మీద ఉన్న యక్షిణిని ఎలాగైనా వశం చేసుకోవాలనుకునే మహాకాల్.. 3.తన కలల రాకుమారితో జీవితాన్ని గడపాలనుకునే సగటు కుర్రాడు కృష్ణ.. ఇలా మూడు పాత్రలను కనెక్ట్ చేస్తూ సిరీస్‌ను నడిపాడు. ప్రతీ ఎపిసోడ్ ముందు అలకాపురి దాని చరిత్ర, యక్షిణులు ఎవరు వారి గతం ఏంటి? నాగలోకానికి, యక్షలోకానికి మధ్య ఉన్న వైరం. యక్షిణి భూమ్మీదకు రావడానికి గల నేపథ్యాన్ని వివరిస్తూ సిరీస్‌ను తీర్చిదిద్దారు. యక్షిణి పాత్ర, ఆమె శాపాన్ని పరిచయం చేస్తూ సన్నివేశాలను మొదలుపెట్టిన దర్శకుడు నేరుగా మూడు ప్లాట్‌లను సమాంతరంగా చూపిస్తూ వెళ్లాడు. యక్షిణి అందం చూసి ఆమెతో ప్రేమలో పడిన కృష్ణ చావకుండా ఎలా బయటపడతాడా? అన్న ఉత్కంఠతో సన్నివేశాలను తీర్చిదిద్దిన విధానం బాగుంది. (%ఖబిదిరీనీరిదీరి జీలిఖీరిలిగీ రిదీ శిలిజితివీతి%) యక్షిణిని వశం చేసుకోవడానికి మహాకాల్ వేసే ప్లాన్‌లను కూడా ఆసక్తికరంగా చూపించారు. అయితే, కొన్నిసార్లు మరీ లాజిక్‌కు దూరంగా నడిపిన సన్నివేశాలు తేలిపోయాయి. మూడో ఎపిసోడ్‌లో జ్వాలాముఖి( మంచు లక్ష్మి) పాత్రతో ఊహించని ట్విస్ట్ ఇచ్చాడు దర్శకుడు. థ్రిల్లింగ్‌గా సాగే సిరీస్‌లో మధ్యలో కృష్ణ కుటుంబం చేసే హంగామా సాగదీత వ్యవహారంలా అనిపిస్తుంది. ఒక సీరియస్ మోడ్‌లో సాగుతున్న సిరీస్ స్పీడ్ బ్రేకర్ వేసినట్లు అనిపిస్తుంది. ఒక్కో ఎపిసోడ్ సాగుతున్న కొద్దీ పాత్రలు వాటి నేపథ్యాలు మరింత బలంగా చూపించాల్సింది పోయి, సన్నివేశాలు, పాత్రలు పలుచబడిపోయాయి. కథ ముందుకు సాగుతున్న కొద్దీ పాత్రల మధ్య సంఘర్షణ తగ్గిపోతూ వచ్చింది. ముఖ్యంగా చివరి రెండు ఎపిసోడ్స్‌లో అనవసరంగా కామెడీని ఇరికించారు. ప్రధాన పాత్రలకు ఎమోషన్స్ జొప్పించి ప్రేక్షకులకు కనెక్ట్ చేయాలని చూసినా అవి కూడా అంతగా రక్తి కట్టలేదు. చివరి ఎపిసోడ్ 'విరూపాక్ష', 'అంజి' సినిమాలు గుర్తుకు వస్తాయి.

**ఎవరెలా చేశారంటే:** యక్షిణిగా మాయ పాత్రలో వేదిక అందంగా కనిపించింది. కొన్ని సన్నివేశాల్లో భయపెట్టింది. యక్షిణిని వశం చేసుకునే మాంత్రికుడిగా మహాకాల్‌గా అజయ్ వైవిధ్యమైన పాత్రలో నటించి మెప్పించారు. జ్వాలముఖిగా మంచు లక్ష్మి ట్విస్ట్ ఇచ్చే పాత్ర. సిరీస్‌లో ఆమే కీలకం. యక్షిణిని ప్రేమించే యువకుడిగా రాహుల్ విజయ్ తన పాత్రకు న్యాయం చేశాడు. మిగిలినవాళ్లు తమ పరిధి మేరకు నటించారు. సాంకేతికంగా సిరీస్ బాగుంది. వీఎఫ్ఎక్స్ బడ్జెట్ పరిమితుల మేరకు ఉన్నాయి. దర్శకుడు తేజ మర్ని చందమామ కథను ఎంచుకుని, నేటి తరానికి అనుగుణంగా తీర్చిదిద్దిన విధానం కొంత వరకూ బాగుంది. తొలి ఎపిసోడ్స్‌లో యక్షిణి, నాగలోకం అంటూ బలంగా కథను ప్రారంభించిన తేజ, క్లైమాక్స్ వచ్చే సరికి కథ, పాత్రల్లో సంఘర్షణ తగ్గిపోయి, రొటీన్ మూవీని చూసిన ఫీలింగ్ కలుగుతుంది.

ఇలాంటి కథలను చూసేటప్పుడు లాజిక్‌లు వెతక్కుండా చూస్తే, సినిమా/సిరీస్‌ను పూర్తిగా ఆస్వాదించగలమన్నది వాస్తవమే అయినా, కొన్ని సన్నివేశాలు మరీ లాజిక్‌కు దూరంగా ఉంటాయి. అవేంటో మీరు సిరీస్ చూస్తున్నప్పుడు సులభంగానే గుర్తిస్తారు.

కుటుంబంతో చూడొచ్చా: అసభ్య సన్నివేశాలు, సంభాషణలు లేకపోయినా అక్కడక్కడా ముద్దు సన్నివేశాలున్నాయి. నిడివి కూడా తక్కువే. ఒక్కో ఎపిసోడ్ సుమారు 30-35 నిమిషాలు ఉండటం రిలీఫ్. ఫాంటసీ డ్రామాతో కూడిన కథలను ఇష్టపడేవారికి మాత్రం 'యక్షిణి' నచ్చుతుంది. డిస్నీహాట్‌స్టార్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL 16448. e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com